ఆదివారం

ప్రజాశక్తి

మార్చి 9, 2003

మహిళలకు స్ఫూర్తి మార్చి 8

హ్యాపీ బర్త్‌డే

(9-3-2003 నుండి 15-3-2003 వరకు)

నీలవరలక్ష్మీ
మార్చి, 2003,
సత్యవతి-యాదగిరి, మిర్యాలగూడ, నల్గొండ

సి.హెచ్.మంజుభార్గవి
మార్చి, 2003,
కళ్యాణి-రవికుమార్ కందుకూరు, ప్రకాశం

డి.జాహ్నవి
మార్చి, 2003,
డి. రజని-సాయి, రేపల్లె, గుంటూరు

ఎస్.సౌజన్య
మార్చి, 2003,
గీత-రమేష్, ఖిల్లాగనపురం

గట్టు మనీషా
మార్చి, 15-2003,
స్వప్న-మహేశ్, ఇచ్చోడ, ఆదిలాబాద్

ఉప్పల ప్రణిత
మార్చి, 10-2003,
మమత-యోగానంద స్వామి, జైనూర్, ఆదిలాబాద్

ఎలాల సాయిఫణీంద్ర
మార్చి, 2003,
సంగీత-లక్ష్మారెడ్డి, దిమ్మ, ఆదిలాబాద్

ఎన్.మంజూష
మార్చి, 9,1999
జయలక్ష్మి ప్రసాద్, వించిపేట, విజయవాడ

బి.బబ్లూ
మార్చి, 2003,
కవిత-మల్‌రెడ్డి, చేవెళ్ళ, రంగారెడ్డి

హెచ్.సృజన
మార్చి, 2003,
వనజ-ధూలప్ప, బోధన్, నిజామాబాద్

డి.సృజిత్ తేజ్ నాయుడు
మార్చి, 2003,
అమరావతి-శ్రీనివాసరావు, నెల్లూరు

సాయి నవనీత్
మార్చి, 9, 2002,
పద్మ-శ్రీనివాస్, వంగూర్, మహబూబ్‌నగర్

టి.మనోజ్
మార్చి, 2003,
లక్ష్మీకాంత-మల్లూరు, అశ్వాపురం, ఖమ్మం

...తానికి గురయ్యారో దానికి చికిత్సకు ...లసిన మందులను మీ డాక్టరు రాసిస్తారు. చికిత్స ఉద్దేశమల్లా బాధను పోగొట్టి, బిరుసుదనాన్ని వదులు చేసి, కీళ్ళలో వాపును తగ్గించి వాటిని సక్రమంగా పని చేసేలా చేయటమే. ఒంటి బరువును తగ్గించటం ద్వారా బరువును భరించే కీళ్ళపై ఒత్తిడి తగ్గుతుంది. ఫిజికల్ థెరపీ చేయించుకోవటం ద్వారా కండరాలకూ బలం రావటమే కాక కీళ్ళ కదలికలను కూడా నార్మల్‌కు అతి దగ్గరగా తీసుకొచ్చే అవకాశం ఉంటుంది. నడుము, మోకాళ్ళ కీళ్ళు తీవ్రంగా పాడైపోయిన సందర్భాలలో శస్త్ర చికిత్స ద్వారా కీళ్ళ మార్పిడి చేయవచ్చు.



కీళ్ళ నొప్పులను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు ఏం చెయ్యాలి?

కీళ్ళ నొప్పులను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు గాను బాధను, వాపును, బిగబట్టుకున్న కండరాలను సడలింప చేయటంతో పాటు కీళ్ళు ఇంకా అరిగిపోకుండా ఉండేలా చూసుకుంటూ, యాక్టివ్‌గా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడిపేందుకు ఎలాంటి ఆటంకమూ కలగకుండా చూసుకోవాలి.

కీళ్ళ నొప్పులను నియంత్రించటానికి తీసుకోవాల్సిన ముఖ్యమైన సూత్రాలు :

- డాక్టర్ సిఫార్సు చేసిన మందులనే వాడాలి.
- శరీరం బరువు ఎక్కువగా ఉంటే ఆ బరువును తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి.
- డాక్టర్ సిఫార్సు చేసిన దేహాభ్యాసాలు చేయాలి.
- దేహాన్ని ఆరోగ్యంగా ఉంచుకునేందుకుగాను పోషక విలువలున్న మితాహారాన్ని భుజించాలి.



కీళ్ళనొప్పులతో బాధపడే వ్యక్తి ఎటువంటి ఆహారాన్ని తీసుకోవాలి ?

- ఆహారంలో కాయగూరలు, పండ్లు, ధాన్యం వగైరాలు చేర్చుకోవాలి.
- కొవ్వు, కొలెస్ట్రాల్ ఉన్న పదార్థాలను తగ్గించాలి.
- ఒంటిబరువు పెరగకుండా చూసుకోవాలి.
- మద్యపానం మానుకోవాలి.
- సూచించిన విటమిన్లు, మినరల్స్‌తో పాటు కాల్షియం, షల్లాకి, గుగ్గిళ్ళు వంటి హెర్బల్ దినుసులు ప్రతిరోజూ తీసుకోవాలి.

కీళ్ళనొప్పుల జబ్బులకు దేహాభ్యాసం ఎంతవరకు ముఖ్యం ?

కీళ్ళ నొప్పుల చికిత్సలో దేహాభ్యాసం ఎంతో ప్రముఖ పాత్రను వహిస్తుంది. ఎలాంటి దేహాభ్యాసం ఉత్తమమైనది అనే విషయాన్ని గురించి మీ డాక్టరే నిర్ధారిస్తారు. ఏ రకానికి చెందిన కీళ్ళవాతం, దెబ్బతిన్న కీళ్ళ ప్రాంతాన్ని బట్టి, వ్యాధి తీవ్రతను బట్టి దేహాభ్యాసాన్ని నిర్ధారిస్తారు. దేహాభ్యాసం చేయటం వల్ల కీళ్ళనొప్పులు తగ్గుతాయి. బిరుసు దనాన్ని తగ్గించి కీళ్ళ కదలికలను సులభం చేస్తాయి. కండరాలకు బలాన్ని కలిగిస్తాయి. ఎముకలకు ఏర్పడే నష్టాన్ని తగ్గిస్తుంది. కీళ్ళ వాపులను నియంత్రించటానికి సహకరిస్తుంది. నిస్సత్తువను పోగొట్టి నిద్రను మెరుగుపరుస్తుంది. బరువు తగ్గటానికి దోహదపడుతుంది. ఎముకలకు కార్టిలేజన్‌కు బలాన్ని కలిగించడంతో పాటు ఆరోగ్యవంతంగా చేస్తుంది.

కీళ్ళ వ్యాధి పీడితులు జీవితకాలమంతా బాధ అనుభవించాలని, కదలకుండా ఉండాలంటూ నియమం ఏదీ లేదు. బాధను ఉపశమింప చేయటానికి పలు రకాల చికిత్స విధానాలు ఉన్నాయి. వ్యాధి ముదరకుండా ఉండేలా చేసుకోవచ్చు. ఈ చికిత్సా విధానాలను గురించి డాక్టర్‌తో మీరు సంప్రదించవచ్చు. ◆

గ్రీన్‌హౌస్ వాయువుల దుష్పరిణామాలు

నాగరికత, టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న కొద్దీ పర్యావరణ కాలుష్యం పెరిగిపోతోంది. మానవునికి ప్రాణాధారాలయిన నీరు, గాలి, ఆహారం, పరిసరాలు కలుషితమై పోతున్నాయి. పరిశ్రమల నుంచి వెలువడుతున్న కలుషిత వాయువులు, పొగలవల్ల, భూగోళం వేడెక్కడం అధికమైంది. గత 600 సంవత్సరాలతో పోల్చితే ఈ శతాబ్దంలో భూగోళం వేడి అధికమైంది. ముఖ్యంగా 10, 12 ఏళ్ళకు వేడి పెరుగుతోంది. అత్యంత వేడిమి సంవత్సరంగా 1998 రికార్డులలోకి ఎక్కింది. ఆ తరువాతి స్థానం 2002దే. ఈ సంవత్సరం మే నెలలో భారతదేశంలోని ఉత్తర, దక్షిణ, కేంద్ర ప్రాంతాలలో వీచిన వడగాలులు, సూర్యతేజం అత్యంత తీవ్రమైనవి. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 1000 మందికి పైగా మరణించారు. ఉత్తరాదిలో కూడా అనేక మరణాలు సంభవించాయి.

మామూలు ఉష్ణోగ్రత కన్నా స్థానిక ఉష్ణోగ్రత 4 నుంచి 6 డిగ్రీల సెల్సియస్ పెరిగితే వడగాలిగా మారుతుందని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ఈ విధంగా ఉష్ణోగ్రత పెరగడం గ్లోబల్ వార్మింగ్ సంకేతంగా వాతావరణ శాస్త్రజ్ఞులు పరిగణిస్తున్నారు. ఇది తరచూ సంభవిస్తుందంటున్నారు. 2002లో ఎండ వేడిమి పెరగడం ఇందుకు స్పష్టమైన ఉదాహరణ. విజయవాడలో ఉష్ణోగ్రత 49 డిగ్రీల సెల్సియస్‌కు చేరడం దేశంలో వాతావరణ శాస్త్రజ్ఞుల దృష్టిని ఆకర్షించింది. దేశంలో ఉపరితల గాలుల ఉష్ణోగ్రతలు ప్రతి నూరు సంవత్సరాలకు 0.4 డిగ్రీల సెల్సియస్ పెరుగుతాయని ముఖ్యంగా వర్షాకాలం ముగిసిన తరువాత శీతాకాలం ప్రవేశించే ముందు ఇలా జరుగుతుందని శాస్త్రజ్ఞులు చెప్పారు. 2050 నాటికి వేసవి ఉష్ణోగ్రత 2.2 డిగ్రీల సెల్సియస్, 2080 నాటికి 3.2 డిగ్రీలు పెరుగుతుందని అంచనా.

పారిశ్రామిక కాలుష్యం, వాయు కాలుష్యం, వాహనాలు విడుదల చేసే విషవాయువులు, ఓజోన్‌పొర పలుచబడటం గ్లోబల్ వార్మింగ్‌కు కారణాలంటున్నారు. అంతే కాదు, ఈ విపరీతమైన ఎండవేడిమి కారణంగా వర్షాగమనం తీవ్ర మార్పులకు గురవుతుంది. 1991 నుంచి 1998 వరకు కురిసిన వర్షాల తీరుతెన్నులు పరిశీలిస్తే వర్షాకాలం ఒడిదుడుకులకు లోనయినట్లు అర్థమవుతుంది. ఈశాన్య రాష్ట్రాలలో వర్షపాతం మామూలు కన్నా 17 శాతం, మధ్యప్రదేశ్, తూర్పు ప్రాంతంలో 12 శాతం తగ్గింది. ఇదే తీరు పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీలలో కొనసాగింది. 2050 నాటికి శీతాకాలపు వర్షపాతం గణనీయంగా తగ్గికరువు కాటకాలకు దారితీయవచ్చని శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు.

భూగోళం వేడెక్కడం వల్ల కలిగే దుష్పరిణామాలు మానవులనే గాక జంతు జాలాలను కూడా వేధిస్తున్నాయి. మంచుకొండలు, హిమఖండాలు కరుగుతున్నాయి. సముద్రాలు వేడెక్కుతున్నాయి. సముద్రజలాల మట్టాలు పెరుగుతున్నాయి. హిమఖండాలు కరిగి అదృశ్యమై గంగ, యమున వంటి నదులు సైతం ఎండిపోయాయి. జల వనరులు క్షీణించడంతో వ్యవసాయం కుంటుపడి ఆహారోత్పత్తి దెబ్బతింటోంది.

ఆరోగ్యపరంగా కూడా వేడిమివల్ల అనేక వ్యాధులు ప్రబలుతాయి. మానవ శరీరం వీటిని తట్టుకోలేదు. ప్రమాదకర క్రిమికీటకాదులు వ్యాపించి వ్యాధులు కలుగజేసి మానవుల ఉనికికే ముప్పు తేవచ్చు. ఈ విపరీత పరిణామాలన్నీ గ్రీన్‌హౌస్ వాయువుల ప్రభావమేనని వేరుగా చెప్పనక్కరలేదు

ఈ ప్రమాదకర పరిస్థితుల నుంచి మానవాళిని రక్షించేందుకు విరివిగా చెట్లు నాటడం, పరిశ్రమల నుంచి వ్యర్థపదార్థాలు. వాహనకాలుష్య నిరోధం వంటి చర్యలు ప్రభుత్వాలు, ప్రజలు చేపట్టాలి.

ఈ నేపథ్యంలో కాలుష్య, నివారణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్దిష్టమైన చర్యలు ప్రకటించడం ముదావహం. రాష్ట్రంలో జల, వాయు, వాహన కాలుష్య నివారణకు పంచవర్ష ప్రణాళికను కాలుష్య నియంత్రణ మండలి ప్రకటించింది. దీనిని చిత్తశుద్ధితో అమలు చేస్తే రాష్ట్రంలో కాలుష్యం అదుపు అవుతుందనడంలో సందేహంలేదు. ◆

✻ అంపశయ్య నవీన్

"మన వాళ్ళేమిటి, మరీ ఇంత చెత్తగా ఆడుతున్నారు" అంటూ వచ్చాడు ఇండియన్ క్రికెట్ వీరాభిమాని సాంబశివరావు.

"చెత్తగా ఆడాలని ఎవరూ ఆడరు.. అందరూ బాగా ఆడాలనీ, గెలవాలనే ఆడతారు. ఒక్కొక్కసారి అలా జరుగుతుంది" అన్నాన్నేను.

"లేదుసార్.. మన వాళ్ళకు డబ్బు పిచ్చి ఎక్కువైంది'' యాడ్స్'' రూపంలో, ఎండార్స్‌మెంట్స్ రూపంలో ఒక్కొక్కడు కోట్లు సంపాదిస్తున్నాడు.. సినిమాస్టార్ల చుట్టూ, డిస్కోతిక్‌ల చుట్టూ తిరుగుతూ, మందుకొడ్తూ గడిపేస్తున్నారు. వీళ్ళకు క్రికెట్ సీరియస్‌గా ఆడే టైమెక్కడుంటుందండీ! వీళ్ళందర్నీ పట్టుకొని తన్నాలి. టీమ్‌లోంచి అందర్నీ తీసిపారేసి కొత్త వాళ్ళకు ఛాన్స్ ఇవ్వాలి.. వందకోట్ల జనాభా ఉన్న దేశంలో ఓ పదకొండు మంది బాగా ఆడేవాళ్ళు దొరకరా? దేశం పరువు తీసి పారేస్తున్నారు.. వీళ్ళను ఉరితీసినా పాపం లేదు"

"మిస్టర్ సాంబశివరావ్! మరీ ఆవేశంగా, నువ్వేం మాట్లాడుతున్నావో తెలుసుకోకుండా మాట్లాడేస్తున్నావు. ఈ దేశంలో ఉన్న నీలాంటి క్రికెట్ వీరాభిమానుల వల్లనే దేశ ప్రతిష్ఠ దిగజారిపోతున్నది. ఒక్క మ్యాచ్ ఓడిపోయినంత మాత్రాన క్రికెటర్ల ఇండ్ల మీద దాడి చెయ్యడం, క్రికెటర్ల దిష్టిబొమ్మల్ని దగ్ధం చెయ్యడం.. ఏమిటిది? దిసీజ్ మ్యాడ్‌నెస్! బార్బరస్! దట్స్‌ఏ గేమ్.. ఓ ఆట.. "ఆటలో ఒక టీం ఓడిపోతుంది... ఒక టీం గెలుస్తుంది. గెలిచినప్పుడు సంతోషించాలి. ఓడిపోయినప్పుడు మనకంటే బాగా ఆడిన టీం గెల్చిందని ఆ టీమ్‌ని అభినందించాలి. అంతేగాని మన వాళ్ళేదో కావాలని ఓడిపోయినట్లుగా నీలాగ వాళ్ళను బూతులు తిట్టడం, నీకంటే వీరాభిమానులేమో వాళ్ళ ఇండ్లమీద దాడి చెయ్యడం, దిష్టిబొమ్మల్ని తగలబెట్టడం సంస్కారం అనిపించుకోదు. క్రికెట్‌గానీ, మరో ఆటగానీ.. దాన్నో ఆటలాగే చూడాలి తప్ప దేశ ప్రతిష్ఠమొత్తం ఆ ఆట గెలుపు ఓటమిల మీదనే ఆధారపడిందన్నట్టుగా ప్రవర్తించకూడదు."

"మీరేమన్నా చెప్పండి సార్! మనవాళ్ళకు గెలవాలన్న పట్టుదలే లేదు. కిల్లర్ ఇన్‌స్టిక్ట్ పూర్తిగాపోయింది. కోట్ల కోట్ల రూపాయల నోట్ల కట్టల్లో దొర్లుతున్న వాళ్ళకు గెలవాలన్న ఓ బలమైన కోరిక ఎందుకుంటుంది? నిన్న, ఇవ్వాళ్ళ క్రికెట్ ప్రపంచంలోకి అడుగు పెట్టిన శిశువు హాలండ్.. ఓ క్లబ్ టీం స్టాండర్డు కూడా లేని టీమది – ఆ టీమ్‌తో మన టీం అంత ఘోరంగా ఆడుతుందా? ఓ మూడు వందల యాభై పరుగులు సులభంగా చేస్తారనుకున్నాను. అట్లాంటిది అష్టకష్టాలు పడి ఓ రెండువందల పరుగులు చేశారు. మరీ వీక్‌టీం కాబట్టి మన బౌలర్లు అంత తక్కువస్కోరును అధిగమించి మనల్ని గెలిపించారు. చావు తప్పి కన్నులొట్టబోయి హాలండ్ మీద గెల్చాం... తర్వాత ఆస్ట్రేలియాతో

శైశవదశ

ఆడారు ఆఫ్‌కోర్స్!..ఆస్ట్రేలియా చాలా స్ట్రాంగ్ టీమేననుకోండి – అయినా మనవాళ్ళు అంత ఘోరంగా ఓడిపోవడమేమిటి ? ముష్టి నూటఇరవై అయిదు పరుగులకే అందరూ పెవిలియన్ వైపు పరుగులు తీయడమేమిటి? అందుకే మన క్రికెట్ అభిమానులు క్రికెటర్ల ఇండ్ల మీద దాడి చేశారు.. ధనం మత్తులో జోగుతున్న మన క్రికెటర్ల దిష్టిబొమ్మల్ని తగలబెట్టారు.. నన్నడిగితే వాళ్ళు చేసిందాట్లో తప్పేమీ లేదంటాను.. మన క్రికెటర్లను చూస్తే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందంటే మన వాళ్ల తర్వాత ఆడబోయే అన్ని మ్యాచ్‌లు ఓడిపోతారన్నట్టుగా ఉంది. వీళ్ళు క్రికెట్ ఆడి, మన దేశ ప్రతిష్ఠను మట్టిలో కలిపేసే బదులు మూటా ముల్లె సర్దుకొని వీల్లు వెంటనే ఇండియాకు తిరిగొస్తే దేశానికెంతో మేలు చేసిన వాళ్ళవుతారు...." అన్నారు సాంబశివరావు.

అతనితో ఎంతవాదించినా ప్రయోజనం ఉందనుకొని నేను నిశ్శబ్దంగా ఉండిపోయాను.

* * *

మూడు వారాల తర్వాత సాంబశివరావు మళ్ళీ మా ఇంటికొచ్చాడు...

"మన వాళ్ళు ఏం ఆడారు సార్! సి... ఫెంటాస్టిక్! నిన్న పాకిస్తాన్ బౌలర్లని మన సచి... టెండూల్కర్ చీల్చి చెండాడుతుంటే నాకు స్వర్గంలో తేలిపోతున్నట్టుగా అనిపించింది.... సూపర్బ్! మార్వెలస్!.. సూపర్ హ్యూమన్ ఇన్నింగ్స్ ఆడాడు మన సచిన్!... హేట్సాఫ్ టు హిమ్! యువరాజ్‌సింగ్, రాహుల్ ద్రావిడ్, మహ్మద్ కైఫ్, వీరేంద్ర సెహ్వాగ్. ఏం ఆడారు సార్!... పాకిస్తాన్ బౌలర్ల మీద పిడుగులు కురిపించారు.. వాళ్ళను మళ్లీ ఈ జన్మలో కోలుకోకుండా దెబ్బకొట్టారు.. మన వాళ్ళు ఈ వరల్డ్ కప్ గెలుస్తారనడంలో నాకెలాంటి సందేహం లేదు... వాళ్ళు వరల్డ్ కప్ గెలవకపోయినా ఫరవాలేదు.. పాకిస్తాన్‌ను చిత్తుచిత్తుగా ఓడించారు.. అది చాలు.. అది వంద వరల్డ్‌కప్‌లతో సమానం..." ప్రవాహంలా చెప్పుకుపోయాడు సాంబశివరావు మా ఇంట్లో ప్రవేశిస్తూనే.

"పాకిస్తాన్‌తో గెలిస్తే వంద వరల్డ్‌కప్‌లలో గెలవడంతో సమానమవుతుందా? ఏమిటీ ఆలోచన! నీ ఈ ఆలోచన పరమ అసహ్యంగా ఉంది. నువ్వే కాదు.. నీలా ఆలోచించే వాళ్ళు ఈ దేశంలో చాలా మందే ఉన్నారు.. మన వాళ్ళు ఓడిపోయినప్పుడేమో వాళ్ళను బూతులు తిట్టడం.. వాళ్ళ ఇండ్ల మీద దాడి చెయ్యడం... గెలిచినప్పుడేమో ఇలా సూపర్బ్, ఫెంటాస్టిక్ అని పొగిడెయ్యడం.. పాకిస్తాన్ మీద గెలిచినప్పుడు మరీ ఎక్కువగా ఆర్భాటం చెయ్యడం.. అర్ధరాత్రిళ్ళు వీధుల్లో కెళ్ళి క్రాకర్లు పేల్చడం.. వందేమాతరం!.. జైశ్రీరామ్!.. పాకిస్తాన్ ముర్దాబాద్! అని అరవడం.. స్వీట్లు పంచుకోవడం.. యుద్ధంలో గెలిచినంత హంగామా చెయ్యడం.. ఇది కుసంస్కారం.. ఇది అనాగరికం.. ఇది ఆటవిక చేష్ట! ఇది చిన్న పిల్లల ప్రవర్తన! ఇది స్పోర్ట్స్‌మన్ స్పిరిట్ అనే దానికి పూర్తిగా వ్యతిరేకం.. క్రికెట్ అనేదొక ఆట.. ఆటలో గెలుపు ఓటములు చాలా మామూలు విషయాలు.. పాకిస్తాన్ కావొచ్చు.. మరో దేశం కావొచ్చు.. ఒకసారి గెలవొచ్చు.. ఒకసారి ఓడిపోవచ్చు.. టాస్ గెలవడం, పిచ్ కండిషన్, ఆటగాళ్ళ ఫామ్, ఫీల్డింగ్‌లో లోపాలు, ఎంపైరింగ్ డెసిషన్స్.. ఇలాంటి ఎన్నో అంశాల మీద క్రికెట్‌లో గెలుపు ఓటములు ఆధారపడ్తాయి.. అంతేగాని మన వాళ్లు ఓడిపోతే కావాలని ఓడిపోయారనీ, గెలిస్తే వాళ్ళంత ఆటగాళ్లు ప్రపంచంలో లేరని... పాకిస్తాన్‌తో గెలిచినప్పుడేమో యుద్ధంలో గెల్చినట్లుగా పండగ చేసుకోవడం.. మనం ఇలాంటి శైశవ దశ నుండి పరిపక్వ దశకు చెరుకోకపోతే ఈ దేశపు యువతరానికి భవిష్యత్ లేదనిపిస్తుంది. పాకిస్తాన్‌కు, మనకూ కొన్ని చారిత్రక కారణాల వల్ల రాజకీయ విభేదాలుండొచ్చు.. వాటిని రాజకీయ నాయకులకు వదిలేద్దాం. కానీ ఆటలకూ, రాజకీయాలకు సంబంధం పెట్టడం మనం ఒకజాతిగా ఎదగకపోవడాన్నే సూచిస్తుంది" అన్నాను నేను. ◆

...లు కలపండి



మూడు సూక్తులు

ఓసారి నసీరుద్దీన్‌కి డబ్బులు అవసరమయ్యాయి. ఏదైనా పనిచేసి సంపాదిద్దామనుకున్నాడు. కావడిబద్ద, తాడు తీసుకుని బయలు దేరాడు. తనలాగే పని కోసం ఎదురు చూస్తున్న వాళ్ల దగ్గరకెళ్లి కూర్చున్నాడు. ఎంతకీ పని దొరకలా. ఈలోగా ఓ భూస్వామి వచ్చాడు. చేతిలో ఓ పెట్టె వుంది. 'నేను పింగాణీ సామాను కొన్నాను. ఎవరైనా వాటిని మా యింటి వరకు మోసుకొస్తే వాళ్లకు విలువైన మూడు సూక్తులు చెప్తాను' అన్నాడు. ఎవరూ అతని గురించి పట్టించుకోలా. నసీరుద్దీన్ మాత్రం చాలా ఆసక్తిగా 'ఆహా... ఏమి అవకాశం? డబ్బులదేముంది? ఎప్పుడైనా సంపాదించుకోవచ్చు. కాని మూడు విలువైన సూక్తులు ఎవరు చెప్తారు?' అనుకున్నాడు. వెంటనే ఆ భూస్వామి వైపు తిరిగి 'నేను వస్తాను' అన్నాడు. ఇద్దరూ బయలు దేరారు. కొన్త దూరం వెళ్లాక 'ఏదీ ఏవో సూక్తులు చెప్తానన్నారుకదా. చెప్పరే' అన్నాడు నసీరుద్దీన్. 'చెప్తా... జాగ్రత్తగా గుర్తించుకో. కడుపు నిండుగా వుండేకంటే ఖాళీగా వుంటే మంచిదని ఎవరైనా చెప్తే నమ్మొద్దు' అన్నాడు.

'ఆహా' అనుకున్నాడు నసీరుద్దీన్. మరికొంత దూరం వెళ్లాక 'రెండో సూక్తి కూడా సెలవిస్తారా?' అన్నాడు ఎంతో ఆసక్తిగా. 'గుర్రం మీద ప్రయాణం చేసేకంటే నడిచి పోవడం మంచిదని ఎవరైనా చెప్తే నమ్మకు' అన్నాడు. ఇంకొంత దూరం వెళ్లాక మూడో సూక్తి చెప్పమని అడిగాడు నసీరుద్దీన్. 'ఈ లోకంలో నీకంటే పెద్ద బడుద్ధాయి వున్నాడని ఎవరైనా చెప్తే అస్సలు నమ్మమాకు' అన్నాడు. ఇవన్నీ విన్న నసీరుద్దీన్ 'ఆహా... ఓహో నాకు ఎంతటి భాగ్యం వుంటే ఇంతటి విలువైన సూక్తులు వినగలిగాను' అంటూ టపామని భుజం మీద వున్న కావడిని కింద పడేశాడు. అంతే పింగాణీ సామానంతా పగిలిపోయింది. 'ఏంటి ఈ పిచ్చిపని!' అన్నట్లు చూస్తున్న భూస్వామి వైపు తిరిగి 'మీ పింగాణీ సమాను పగిలిపోయిందని ఎవరైనా చెప్తే చచ్చినా నమ్మమాకండి' అని వెళ్లిపోయాడు నసీరుద్దీన్ ఎంచక్కా.

రహస్యపు ఉత్తరం

...వారం మీకు ఓ రహస్యం చెబుదామనుకుంటున్నా.
...ముందు మీరు ఓ తెల్లటి కాగితం తీసుకోండి. అలాగే
...డా. ఓ కొత్త పాళీ పెట్టిన పెన్ను తీసుకోండి. ఈ పెన్నును
...ంలో ముంచండి.
...కాగితంపై రాయండి.
...త్రునికి ఇచ్చేయండి.
... ఈ ఉత్తరాన్ని కొవ్వొత్తి
... పెట్టి చదువుకో' అని
...ంతే. మీరు రాసిన
...మీ మిత్రునికి తప్ప
...లియదు. 'అవునూ...
... ముంచిన పెన్నుతో
...లు ఎలా పడతాయి'
... మీ అనుమానం.



... మీరు రాసిన కాగితాన్ని కొవ్వొత్తి దగ్గరగా తీసుకు
...వ్వొత్తి మంట వేడికి తెల్లకాగితంపై వున్న నిమ్మరసం
విఘటనం చెందుతుంది. గోధుమరంగు అక్షరాలతో
...రం కనిపిస్తుంది. ఇదేవిధంగా సల్ఫ్యూరికామ్లంతో
...ం రాయవచ్చు. కాకపోతే ఉత్తరాన్ని వేడిచేస్తే అక్షరాలు
...లో కనిపిస్తాయి. ఇదీ రహస్యపు ఉత్తరంలో వున్న
...చ్చేవారం గ్లాసుతో
...యించడం ఎలాగో
...ాం. బైబై.

మేజిక్! మేజిక్!!

కలం స్నేహం

పేరు: ఎన్.మేఘన,
వయసు : 6 సం॥
చదువు :1 వతరగతి
హాబీలు : డ్రాయింగ్ వేయడం, డాన్స్ చేయడం, టీవీ చూడడం.
పూర్తి చిరునామా : ఎన్.మేఘన, డాటరాఫ్ ఎన్.సోమయ్య, ఇంటి నెంబరు 1-2-607, న్యూ బోయిగూడ, హైదరాబాదు.

పేరు: ఎ.వెంకటస్వామి,
వయసు : 14 సం॥
చదువు : 9 వతరగతి
హాబీలు : పుస్తకాలు చదవడం, డైరీ రాయడం, చెస్ ఆడడం.
పూర్తి చిరునామా : ఎ.వెంకటస్వామి, సన్నాఫ్ ఎ.రాములు, యర్రగొండపాలెం, ప్రకాశం.

పదాల పదనిసలు

పొ	
హ	
క	?
బ	
జ	
స్థ	

ఒక్క అక్షరం కలపండి

గతవారం జవాబులు

గో	
రే	
చా	వృ
పా	
తా	

✻ రుక్మిణి

కరువు - జన్మభూమికే కరువు

"కరువొచ్చిందోయ్ మావా.. కరువొచ్చిందీ.. కరువొచ్చి నీకోసం ఏదో తెచ్చిందోయ్ మావా" – ఇద్దరు జన్మభూమి ప్రచార కళాకారులు చప్టామీద పాటకు తగులుకుని చిందరవందరగా గెంతులు గెంతారు – నోడల్ అధికారి చెట్టు చాటు నుండి బిక్కుబిక్కుమని బృందంతో సహా వచ్చి చప్టామీద కూలబడ్డాడు. ఏవీ.. ఎక్కడా పిల్లా పీతుకూ – ఆడామగా – ముసలీ ముతకా జాడే లేరాయె!

"ఏంటిసార్! చంద్రబాబుగారు ఇంత అట్టహాసంగా 'కరువు జన్మభూమి' మొదలు పెడితే ఒక్కడూ తగలబడి చావడేం!" ఓ ఇంజనీరు విసుగ్గా అన్నాడు. దాంతో నోడల్ గారికి తటాల్న ఓ ఆలోచన బుర్రలో మెరిసింది.

"కొంపదీసి అసలీ గ్రామంలో కరువే అస్సలు లేదేమో.. ఏమోయ్! గ్రామంలో కరువు లేదనడానికి దాఖలా నెంబర్ వన్– ఏంటంటే అక్కడి ప్రజలెవరూ 'జన్మభూమి'లో పాల్గొనక పోవడం.." ఆ పాయింటు రాసెయ్!

ఒక గుమాస్తా ఆదరా బాదరాగా గిలికేశాడు – 'కరువొచ్చిం... మావా...' కళాకారులు మళ్ళా చిందులకు తగులుకున్నారు. ఎండ ఫెటఫెటలాడి పోతుంది. ఒక్కడూ పత్తాలేడు. అపుడు ఆదరాబాదరాగా గ్రామ సేవకుడు అంగలార్చుకుంటూ వచ్చివడ్డాడు. వాడివెనకగాతలే దప్పువాడు వగరుస్తూ వచ్చాడు.

"ఇండ్లల్ల ఎవ్వడున్నాడో తెల్వదు.. చాల ఇండ్లకు తలుపులేసి గొళ్ళాలు మాత్రం పెట్టి వున్నై" అని వివరించాడు.

"ఏమోయ్ గ్రామంలో తలుపులకు గొళ్ళాలు మాత్రమే బిగించి వాటికి తాళాలు వేయకపోడంలో పరమార్థం ఏంటి ? ఇక్కడ దొంగతనాలు అవీ జరగడం లేదనా? అంటే దోచుకోడానికి ఎవనికీ ఏమీ అక్కర్లేదన్నమాట! అంటే అది అస్సలు 'కరువు' లేనే లేదనడానికి గుర్తు.. రాసెయ్...!"

ఒక గుమాస్తా రెండో పాయింటు క్రింద ఆదరాబాదరాగా గిలికాడు – దప్పువాడు అలుపు తీర్చుకుని దప్పు టమటమ మోగించి బిగ్గరగా పల్లవి కేకకు తగులుకున్నాడు.. జన్మభూమి కరువు.. కరువు జన్మభూమి... జన్మభూమికే కరువు" అందరూ రావాలండహో...!" అని కేకలు పెట్టి చతికిల పడ్డాడు.

అప్పటికి మిట్టమధ్యాహ్నం దాటి ఎండపడమరకు చేరుకుంటున్నది. అపుడు సొక్కుతూ.. సోలుతూ ఓ అరడజను మంది 'ప్రజలు' వచ్చి వుస్సురని కూలిన మట్టి గోడలకు జారగిలబడ్డారు. నోడల్‌గారు బహుసంబరంగా చంకలు గుద్దుకుని గొంతు సవరించుకుని ప్రారంభించాడు.

"ఇది కరువు జన్మభూమి... టోటల్‌గా కరువు కారణాలు తెలుసుకుని విశ్లేషించడం మా పని... చెప్పండి! నిలదీయండి.." కరువంటే ఏంటి – అది ఎట్లా ఉంటుంది? అది ఎన్ని రకాలు? అది ఎట్లా వస్తుంది? ఎందుకు వస్తుంది? వస్తే గిస్తే ఏం చేయాల్సుంటుంది? చివరగా మీరేం చేయదలుచుకున్నారు?" అట్లా ప్రకాశంగా తన గంభీర స్వరంలో పలికి గబిక్కున కూలబడిపోయాడు. వచ్చిన జనాలు ముందు బాహాటంగానే



తెల్లబోయారు. మరి సర్కారు వారు అడిగిన ప్రశ్నలు అలాంటివి! తర్వాత బిత్తర పోయారు. ఎందుకంటే అడిగిన వాళ్ళు సర్కారు మనుషులాయె! ఏం చేయాలో తికమకపడుతున్నంతలో – అందులో వయసుకీ.. ఆకలి దెబ్బకూ బాగా మడతలు పడి వింటిబద్దలా ఒంగిపోయిన ఒక 'పెద్దమనిషి' గొంతు సవరించుకుని' అట్టి ప్రశ్నలకు జవాబులు కావలసినచో తమకు ఆలోచించుకొనుటకు కాస్తంత వ్యవధినిమ్మని అడిగిన వాడాయెను. దీనికి నోడలుగారు మిక్కిలి సంతసించి, అట్టి సమయమును మంజూరు చేసి, ముసిముసిగా తనలో తానే నవ్వుకుని గుంభనగా వుండిపోయెను.

అపుడు అందరూ ఆ మొండి గోడల మధ్యకు అరుదెంచి ఈ కఠినాతి కఠినమైన ప్రశ్నలకు తలపట్టుకుని, దీర్ఘలోచనలో వుండగా... తగు మాత్రము వినోదము.. ఆటవిడుపు నిమిత్తము 'జన్మభూమి కళాకారులకు' సైగ చేయగా వారు వెంటనే పాటకూ.. చిందులకూ తగులుకొనిరి.

"కరువొచ్చిందోయ్‌మావా.. కరువొచ్చి నీకోసం ఏదో తెచ్చిందోయ్.. మావా"! అట్లా కొంతసేపు కాంగానే మొండిగోడల మధ్య నుండి 'పెద్దమనిషి' వెంటరాగా బీడాబిక్కీ చింపిరి 'కరువుజనం' వారి ముందుకు వచ్చి కడు వినయంగా నించున్నారు.

"అయ్యా.. కరువంటే అదో అర్థంగాని 'బ్రహ్మ' పదార్థం – చాలా గడుసరిదీ – ఎందుకంటే అది 'ఆత్మజ్ఞానానికి' సంబంధించినవి. ఉందనుకుంటే వుంటుంది.. 'లేదూ' అనిగానీ అనుకుంటే – గవర్మెంటుగారి లెక్కల్లో అవసరాన్ని బట్టి తగ్గుతుంది.. కావాలంటే వెంటనే పెరుగుతుందీ..."

నోడల్‌గారు ముందు వినోదంగా.. నోరు బార్లా తెరిచారు. పాటగాండ్లు – వెంటనే చిందులాపారు.

"కరువు ఎట్లా వుంటుందని అడిగారు. దాన్ని మాటల్లో వివరించడంలో అంత 'మజా' లేదు. అది అనుభవించితేగానీ బుర్రకెక్కదు. రెండోది అది బహురూపి.. సర్వాంతర్యామి.. దాని కోరలు చాలా పొడవు.. మా వంటి వారికది డేంజరే అయినా మీ వంటివారికది కల్పతరువు. దాన్ని గురించి మీలో మీరే మీ 'కుతి' తీరేదాకా చర్చించుకునే విధంగా 'కమ్మ'గా కూడా ఉంటుంది...!"

నోడలుగారు విరుచుకుపడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాడు.

"కరువెన్ని రకాలు అని అడిగారు... అబ్బో.. మనిషి ఎన్ని రకాలుగా ఆలోచించుకుంటే అన్ని రకాలు.. నీటి కరువు... తిండి కరువు... బట్టకరువు... పదవులక్కరువు.. ఓట్ల కరువు.. అప్పులకరువు.. అధికార కరువు.. ఎన్నని చెప్పమంటారు.. మనిషి స్థితిని బట్టి అది వెంటనే తన రూపాన్ని మార్చేసుకుంటుంది.. టక్కుటమారి..!"

నోడలుగారు విధిలేక.. ఒంట్లో నీరంతా ఆవిరైనట్లు కాగా కూలబడక తప్పలేదు. అది ఎట్లా వస్తుందీ.. ఎందుకు వస్తుందీ...అని.. రెంటికీ జవిలిగా చెప్పదలుచుకుంటే తమ వంటి మహానుభావుల ఏలుబడిలో అదిగాక మరేం వస్తుందనీ అడగల్సుంటుంది. అవి అట్లా వచ్చి పడడానికికారణాలు మాకంటే మీకే బాగా తెలుసుగానీ.. తెలవనట్లు మాతో పరాచికాలాడుతున్నారు – పరాచికాలకూ మనకేం దగ్గర చుట్టరికం కూడా లేదనుకుంటా – ఎందుకంటే అటు కేంద్రం.. ఇటు చెంద్రబాబుగారు సరదాలు పడి సరస వినోదాలు.. సర్వేలు జోకులు... చమత్కారాలు.. చేసుకోవడానికే ఇది బాగాపని చేస్తుంది. పూబంతులు ఒకరి మీద మరొకరు విసురుకున్నట్లు.. ఒకర్ని మరొకరు నిందించుకుంటున్నట్లు.. కేంద్ర బృందాల పర్యటనలు.. రాష్ట్ర మంత్రుల చమత్కారాలు.. ఇదుగో ఇట్లాంటి "పరాచికాల జన్మభూములు"

నోడల్ గారు బలవంతంగా మూర్ఛను నిగ్రహించుకుంటున్నారు. ఒక గుమాస్తా గిలకడం మాని ఒళ్ళంతా గిచ్చుకుంటూ చొంగలు కారుస్తున్నాడు.

"వస్తేగిస్తే ఏం చేయాల్సుంటుందని మమ్మల్నే అడిగారు. బాగుంది–అంతా చేయాల్సింది మీరే అయినా మమ్మల్ని అడిగి గొప్ప హాస్యం పట్టిస్తున్నారు. కాబట్టి.. మిమ్మల్ని వెంటనే ఊర్లో నుండి బయటకు పంపి మా బాధలేవో మేం పడడమే మేం చేయాల్సింది...!" ◆

సంసారంలో క్రికెట్!

*లక్ష్మి

వరల్డ్ కప్ టోర్నీ పుణ్యమాని - మనమంతా క్రికెట్ సీజన్లో వున్నాం. మొదట్లో మన వాళ్ళ వైఫల్యానికి విసుక్కున్నాం. నోటికొచ్చినట్లు ఇంట్లో పులులూ బయట పిల్లికూనలనుకున్నాం. మన క్రికెట్ యోధులు అంబాజీపేట హైస్కూలు పిల్లల్తో కూడా ఆడలేరని అభిప్రాయపడ్డాం. అల్లాంటిది - ఆ తర్వాత భారత విజయపరంపరకు ముగ్ధులమవుతూనే వచ్చేం! మనవాళ్ళు గెలిచిన నాలుగు మేచ్‌లూ ఒక ఎత్తు - శివరాత్రి నాడు సెంచురియన్ పార్కులో పాకిస్తాన్ మీద శివతాండవం చేసి ఘన విజయం సాధించడం ఒక్కటీ ఒక ఎత్తు! దాదాపు రెండున్నర ఏళ్ళ తర్వాత పాకిస్తాన్‌తో ఆడే తొలి అవకాశాన్ని సద్వినియోగపరుచుకున్నారు. అద్భుత విజయం సాధించి ఇంటా బయటా భేషనిపించుకున్నారు. అదట్లా వుంచండి. అసలు విషయానికి వస్తాను! ఆటలు ఆరోగ్యానికి టానిక్కులాటివని చిన్నప్పుడు ఆరోగ్య సూత్రాల్లో మనం చదువుకున్నాం. అవుట్‌డోర్ గేములనీ, ఇండోర్ ఆటలనీ ఆటల్లో కూడా రకాలున్నాయి. వదిలేయండి!

ఏ ఆట ఆడినా అది శరీరానికి శ్రమ కలిగించాలి. అవయవాలన్నీ కదలాలి. అంతో ఇంతో అలిసిపోవాలి. చెమట్లు వర్షించాలి. ఇదంతా కసరత్తు తతంగమన్నమాట. 'ఇలాంటి ఆటలే ఆరోగ్యానికి మంచివని చెబుతుంటారు. ఆటల్లో కాలికో, చేతికో దెబ్బలు తగలడం సహజం. ఓర్చుకోవాలి. అంతేగాని కాలు కైమా అయిపోతుందనీ, చెయ్యి షేపు మారిపోతుందనీ భయపడి మగమారాజులు ఇంటో కూచుని గచ్చకాయలాటకి అంకితమైపోతే - ఆరోగ్యం మాట దేవుడెరుగు - శరీరం పెరిగిపోతుంది! పొద్దస్తమానం చీట్లపేక ఆడేసి అరకిలో ఆరోగ్యం పెంచుకున్నానని చెప్పే మగమారాజుని చూసి జాలి పడాలి. ఇల్లాంటి ఆఫ్టరాల్ ఆటలు బొజ్జని పెంచుతాయి. ఆయాసాన్ని అధికం చేస్తాయి. రక్తపోటుని పెంచుతాయి. తర్వాతర్వాత లేచి కూచునే ఓపిక కూడా నశిస్తుంది. నాలుగడుగులు నడిచి నలభై నిమిషాలు రెస్టు తీసుకునే ప్రమాదంలో పడతాడు!

అంచేత మగాళ్ళకి బాగా సూటయ్యే ఆట క్రికెట్! క్రికెట్ ముఖ్యంగా మగాళ్ల ఆట. మొనగాళ్ల ఆట. ఈ క్రికెట్‌లో బోలెడు ఫిలాసఫీ దాక్కుని వుంది. ముఖ్యంగా వన్‌డే మేచ్‌లు పరిశీలించండి. వాటిని సంసారానికి ఎంచక్కా అన్వయించుకోవచ్చు! బేటింగ్ చేసే యోధులు వంతుల ప్రకారం రంగంలోకి దిగుతారు. వాళ్ళ శక్తీ, వాళ్ల అదృష్టాన్ని బట్టి పరుగులు తీస్తారు. కొందరు సెంచరీలు కొడతారు. కొందరు ఏభై వరకు వచ్చి అవుటవుతారు. మరికొందరు బాతు బొమ్మల్లో వెళ్లిపోతారు. ఎవరు ఎన్ని పరుగులు తీసినా - చివరి ఓవర్లో తీసిన అద్భుతమైన పరుగులకే విలువెక్కువ! సచిన్ ఏభై ఆరు పరుగులూ సెహవాగ్ నలభై ఆరు పరుగులూ ద్రావిడ్ యువరాజులు చెరో నలభై పరుగులు తీసి స్కోరు గణనీయంగా పెంచవచ్చు. కానీ చెప్పుకోతగ్గ ఎనిమిది వికెట్లూ పడిపోయాయి!

ఇక మిగిలింది బౌలరు! అతనికి బంతులు విసరడమే బాగా తెలుసు. ఆ రంగంలో అతను ప్రముఖుడు! బేటింగులో మాత్రం అంబ అస్సలు పలకదు. రెండంటే రెండే బాల్సు మిగిలేయి. పరుగులు మాత్రం పన్నెండు తీయాలి. చివరి రెండు బాల్సునీ, రెండు సిక్సర్లుగా మలిచేడనుకుందాం! ఆ ఆనందం వర్ణనాతీతం! అంతకుముందు ఏభైలూ అరవైలూ పరుగులు తీసిన వీరులెవ్వరూ గుర్తుకురారు. ఆ ఆటలో సచిన్ సెహవాగులూ, ద్రావిడ్ యువరాజులూ తీసిన ఏభై అరవై పరుగుల్ని ఎవరూ పట్టించుకోరు. బేటింగ్‌లో ఏ మాత్రం అనుభవం గానీ టేలెంటుగానీ లేని బౌలర్‌గారి పన్నెండు పరుగుల విన్యాసమొక్కటే కలకాలం గుర్తుండిపోతుంది!

ఇంచుమించు సంసారంలో గొడవ కూడా ఈ విధంగానే నడుస్తుంది. అయ్యగారు తెచ్చిన జీతం మొదటి వారంలోనే ఖర్చయిపోతుంది! ఇంకా మూడు వారాలు సంసారం గడవాలి. ఎట్లా? ఆ బాధ్యత ఇంటి ఇల్లాలినెత్తిన పడుతుంది. అసంభవాన్ని సంభవం చేసే ఆర్టు ఆవిడకు తెలుసు. ఇల్లాంటి దిక్కుమాలిన పరిస్థితి వచ్చే అవకాశం ఎంతైనా వుందని ముందే ఊహించడం వల్ల - ఆవిడ ముందు జాగ్రత్తలు ఎన్నో తీసుకుని వుంటుంది. అంచేత మిగతా పాతిక రోజులూ ఇంటిల్లిపాదికీ ఎల్లాంటి లోటూ రానీకుండా గడుపుతుంది. అంటే రెండు సెంచరీల మీద అయిదారు పరుగులు కొసరుగా చేసినట్టవుతుంది! ఎల్లుండిజీతాలిచ్చే రోజు! రేపటికి పప్పు ఉప్పు సర్వ వెచ్చాలూ నిండుకుని ఉంటాయి. అందువల్ల రేపు ఇంటిల్లిపాదీ పస్తుండే ప్రమాదం వచ్చేసిందన్నమాట! అదుగో అప్పుడు భర్త రూపంలో వున్న బేటింగు చేతగాని బౌలరు గారు రంగంలోకి దిగుతారు. రాత్రి పేకాటలో గెలుచుకున్న అయిదొందల రూపాయల్లో - రెండు పచ్చకాగితాల్ని ఇంటో స్టైయిల్‌గా విసురుతాడు. అంటే - రెండు సిక్సర్లన్నమాట! ఆ దెబ్బతో ఇంటో జనాభా యావన్మందీ ఆ మహాశయుడికి హారతి పడతారు! అంతేగాని - అయ్యగారు తెచ్చిన జీతం మొదటివారంలో ముదనష్టమైపోగా - మిగతా పాతికరోజుల్లో ఇరవై మూడు రోజులు ఎవరికీ ఎట్లాంటి ఇబ్బందీ రానీకుండా సంసార రథాన్ని సవ్యంగా నడిపిన ఇల్లాలి దక్షతను ఏ ఒక్కరూ గుర్తుంచుకోరు! అయ్యా క్రికెట్ ఆటని ఎవరు, ఎప్పుడు ప్రవేశ పెట్టేరోగాని - ఇంటో క్రికెట్ మాత్రం ఈ విధంగా అనాదిగా సాగుతూనే ఉంది! ◆

దక్షిణ కాశి వేములవాడ



✻ పి.లక్ష్మణ్

'బ్రహ్మ మురారి సురార్చిత లింగం.. నిర్మల భాసిత శోభిత లింగం.. జన్మజ దుఃఖ వినాశకలింగం..' అని కీర్తిస్తూ తత్ర్పణమామి సదాశివలింగం' అంటూ భక్తులు వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరుడిని వీక్షిస్తారు. ఉత్తర తెలంగాణా వాసులు రాజన్నగా మనసారా పిలిచే దేవుడు శ్రీరాజరాజేశ్వరుడు.

ఉత్తరతెలంగాణా జిల్లాల భక్తులు 'దక్షిణ కాశిగా' పిలుచుకునే వేములవాడ పూర్వనామం లేంబుల వాటిక. కాలక్రమంలో అది లేములవాడగా, వేములవాడగా రూపాంతరం చెందినట్లు చెబుతారు. కరీంనగర్‌కు 38 కి.మీ. దూరంలో ఈ వేములవాడ ఉంది. ఈ పుణ్యక్షేత్రాన్ని చాళుక్యుల్లో ప్రముఖుడైన రాజరాజ నరేంద్రుడు నిర్మించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. క్రీస్తుశకం 750 నుంచి 973 వరకూ దాదాపు 220 సంవత్సరాల పాటు చాళుక్యులు ఈ ప్రాంతాన్ని పాలించినట్లు, ఇక్ష్వాకుల పాలన కూడా ఇక్కడ కొనసాగినట్లు ఆధారాలు లభ్యమయ్యాయి. అప్పట్లో ఈ ప్రాంతం శైవ, వైష్ణవ, జైనమతాలకు కేంద్రంగా వర్ధిల్లిందనీ, సంస్కృత, ఆంధ్ర, కన్నడ భాషలకు స్థానికంగా విశేష ప్రాముఖ్యం ఉండేదనీ, ఇక్కడి కొన్ని శాసనాల ద్వారా వెల్లడవుతోంది. ప్రసిద్ధి చెందిన భీమకవి ఇక్కడి భీమేశ్వరుని వరప్రసాదమని భావిస్తారు. కన్నడ మహాభారతంగా పిలిచే విక్రమార్జున విజయాన్ని పంపకవి ఇక్కడే రాసినట్లు చెబుతారు. కాకతీయుల అధీనంలోనూ, ఢిల్లీ సుల్తానుల పాలనలోనూ ఈ ప్రాంతం కొన్నాళ్ళు కొనసాగింది.

వేములవాడ పట్టణంలో ఆదిదేవుడైన శ్రీరాజరాజేశ్వరుని దేవస్థానంతో పాటు ఎన్నో ఆలయాలున్నాయి. ఒక్కో ఆలయానికీ ఒకో రకమైన ప్రత్యేకత ఉంది. ప్రధాన దేవాలయంలో రాజరాజేశ్వరీ అమ్మవారు, ఎడమభాగాన లక్ష్మీ సమేతుడైన గణపతి ఉంటారు. ఆలయ ముఖద్వారాన గజలక్ష్మి, సింహద్వారానికి ఎదురుగా అనంత పద్మనాభస్మామి ఆలయం ఉంటాయి. ఆలయానికి చుట్టూ బాలరాజేశ్వరుడు, విఠలేశ్వరుడు, ఉమామహేశ్వరుడు, త్రిపుర సుందరీదేవిలతో పాటు సమీపంలోనే క్రీ.శ 850-895 మధ్యకాలంలో పరిపాలించిన రెండో యుద్ధమల్లు కుమారుడైన బుద్దిగభూపతి నిర్మించినట్లు భావిస్తున్న భీమేశ్వరాలయం ఉంది. రాజరాజేశ్వరుడిని దర్శించుకున్న అనంతరం భీమేశ్వరాలయానికి వెళ్లడం అనవాయితీ. చేరువనే నగరేశ్వర, వేణుగోపాలస్వామి తదితర ఆలయాలతో పాటు జగన్మాత స్వరూపిణి అయిన బుద్ధిపోచమ్మ అమ్మవారి ఆలయం కూడా ఉంది. రాజన్నను దర్శించుకొని పోచమ్మకు బోనాలు సమర్పించడమూ ఇక్కడ నిత్యం కనిపించే దృశ్యం. రాజరాజేశ్వర ఆలయ ప్రాంగణంలోనే మహ్మదీయుల దర్గా ఉండడం వేములవాడ మత సామరస్యానికి ప్రతీకగా చెప్పవచ్చు. ప్రధాన ఆలయంలో మొత్తం 22 శివలింగాలున్నాయి. దేవాలయం పక్కనే ఉన్న సుప్రసిద్ధ ధర్మకుండం భక్తజనుల విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తోంది. దక్ష యజ్ఞానికి వెళ్ళి అక్కడ వీరభద్రుని వల్ల చేతులు కోల్పోయిన సూర్యుడు ఈ కుండంలో స్నానం చేసి హస్తాలను తిరిగి పొందాడని ప్రతీతి.

ఇక్కడ బహుళ ప్రాచుర్యంలో ఉన్న 'కోడెమొక్కు'ను కోరిన కోర్కెలు తీర్చే మొక్కుబడిగా ఉత్తర తెలంగాణా ప్రజలు భావిస్తారు. తమ కోర్కెలు తీరిన ప్రజలు రాజన్న పేరిట కోడె దూడలను విడిచిపెడతారు. సంతానలేమితో తల్లడిల్లిన దంపతులు తమకు బిడ్డ పుట్టిన తరువాత ఆ బాలుడితోనే కోడెదూడను ఆలయం చుట్టూ తిప్పించి , ముందు భాగాన ఉన్న స్థంభానికి దాన్ని కట్టి వదిలేస్తారు. దూరప్రాంతాల నుంచి కోడెను తెచ్చుకోలేక తమ మొక్కుల కోసం వేచి ఉండే భక్తుల సంఖ్య వేలు దాటి పోతుంది. ఈ ఆలయంలో మాత్రమే వాడుకలో ఉన్న శివపార్వతుల ఆచారం రాష్ట్రంలో మరెక్కడా కనిపించదు. శ్రీరామ నవమి పర్వదినాన మహాశివుడిని పెళ్లాడి జీవితాంతం ఆదిభిక్షువు అడుగుజాడల్లో భిక్షాటనమే వృత్తిగా ఎంచుకునే మహిళలు ఉన్నారు. రోగాల బారిన పడినవారు, ఇతరత్రా కష్టాలను అనుభవించిన మహిళలు రాజరాజేశ్వరునికి మొక్కుకొని అవి తీరిన తరువాత పార్వతిగా మహాశివుడికి అంకితమైపోతారు. ఆధునిక యుగంలోనూ కనిపిస్తున్న ఈ అనాచారం దేవదాసి, బసివిని, మాతంగి సంప్రదాయాల్లాంటిదే. దీన్ని రూపుమాపడానికి దేవాదాయ శాఖ, జిల్లా కృషిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. హరిహర క్షేత్రంగా దేవశాల శృంఖలంగా ప్రసిద్ధి చెందిన వేములవాడకు చారిత్రక, పౌరాహిక వైశిష్ట్యం ఎంతో ఉంది. ఈ దేవాలయంలో అత్యంత ప్రసిద్ధి చెందిన కోడెమొక్కు బెల్లం చెల్లింపులు రాష్ట్రంలో మరెక్కడా లేవు. మహాశివుని వాహనమైన నంది ఇక్కడ ప్రత్యేక పూజలు అందుకోవడం మరో విశేషం. మహాశివరాత్రి, కార్తీక సోమవారాలతో పాటు శ్రీరామనవమి, హనుమజ్జయంతి, వినాయకచవితి పండుగల్ని కూడా ఇక్కడ ఘనంగా నిర్వహిస్తారు. ప్రత్యేకించి కార్తీక మాసంలో ఈ క్షేత్రం కన్నుల పండువగా ఉంటుంది.

వేములవాడకు వార్షిక ఆదాయం 12 కోట్ల రూపాయల వరకూ సమకూరుతోంది. తెలంగాణాలో ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క -సారలమ్మ జాతర లేని సంవత్సరాల్లో ఆదాయం మరింత పెరుగుతుంది. ఇందులో ఆలయ సిబ్బంది వేతనాలు పోగా కొంత వేములవాడ అభివృద్ధికి దేవస్థానం కేటాయిస్తోంది. కరీంనగర్, వేములవాడ, ధర్మపురిలలో సంస్కృత పాఠశాలలు నెలకొల్పింది. పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలతో పాటు కరీంనగర్ శ్రీరాజరాజేశ్వర డిగ్రీ కళాశాలకు కూడా నిధులు సమకూర్చింది. వేములవాడలో హోమియో, అల్లోపతి వైద్యశాలల్ని కూడా నిర్వహిస్తోంది. వివిధ దేవాలయాలకు కూడా లక్షలాది రూపాయలను కేటాయిస్తోంది. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ నుంచి వేములవాడ శ్రీరాజరాజేశ్వర దేవస్థానానికి భక్తులు చేరుకోవడానికి బస్సులు అందుబాటులో ఉన్నాయి.

ద్రావిడ్ తీరే వేరు!

✻ రాంప్రసాద్.ఎం.కె.

సాధారణ మానవుల్లో రెండు రకాల వారుంటారు. ఒకరు అనునిత్యం ప్రచారం కోరుతూ వెలుగులో ఉండాలనుకునేవారు. మరి కొందరు ప్రచారం కోరుకోకుండా బ్యాక్‌గ్రౌండ్‌కే పరిమితం కావడం మంచిదనుకునేవారు. ఈ వర్గీకరణ క్రికెటర్ల విషయంలో కూడా వర్తిస్తుంది. రెండో వర్గానికి చెందుతాడు భారత్ వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్, వైస్ కెప్టెన్ రాహుల్ ద్రావిడ్. ఎవరైనా ఇంటర్వ్యూ చేయడానికి వెళితే మిగిలిన వారు అది తమకు మరింత ప్రచారం తెచ్చిపెడుతుందనే ఉద్దేశంతో వెనువెంటనే ఒప్పుకుంటారు. మరి ద్రావిడ్ అలా కాదు. నా ఇంటర్వ్యూనా అంటూ ఆశ్చర్యపోతాడు. "నన్నే ఎందుకు ఇంటర్వ్యూ చేయడం? జట్టులో యువ క్రీడాకారులున్నారు కదా. వారిని ఇంటర్వ్యూ చేస్తే ప్రోత్సాహకరంగా ఉంటుంది" అని మర్యాదగా సూచిస్తాడు. జట్టు విజయం సాధిస్తే అందులో తన పాత్ర ఉండాలని కోరుకుంటాడు. "జట్టు విజయం సాధిస్తే అందులో నా పాత్ర ఉండాలని కోరుకుంటాను. అలా జరిగితే సంతోషపడతాను" అంటాడు. అతడు మైదానంలో కూడా ఎక్కువగా మౌనంగా ఉంటాడు. నిరంతం వెలుగులో ఉండాలని కోరుకోడు. అతడు చేసే హీరాయిక్స్‌కు ప్రచారం కోరుకోడు. ఉదాహరణకు ఆసీస్‌పై కొల్‌కతాలో అతడు ఆడిన అద్భుత ఇన్నింగ్స్ అందరికీ విదితమే. లక్ష్మణ్ చేసిన 281 పరుగులకు ఎంత ప్రాధాన్యత ఉందో, హర్భజన్ నెలకొల్పిన హ్యాట్రిక్‌కు ఎంత ప్రాధాన్యత ఉందో ద్రావిడ్ ఇన్నింగ్స్‌కు కూడా అంతే ఉంది. అయితే లక్ష్మణ్, బజ్జీ(హర్భజన్)కు లభించిన ప్రచారం అతనికి లభించలేదు. పత్రికలు కూడా వీరిద్దరికే ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చాయి కానీ ద్రావిడ్ చారిత్రాత్మక ఇన్నింగ్స్‌ను విస్మరించాయి. ఈ వరల్డ్‌కప్‌లో కూడా పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ద్రావిడ్ పాత్ర తక్కువేమీ కాదు. సచిన్ అవుటైన తరువాత మరో వికెట్ పడి ఉంటే అంతకుముందు ఆడిన ఆట అంతా బూడిదలో పోసిన పన్నీరై ఉండేది. యువరాజ్‌తో కలిసి ద్రావిడ్ ఇన్నింగ్స్‌ను స్థిరీకరించడంతో భారత్ సునాయాస విజయం సాధించగలిగింది. ఈ మ్యాచ్ విషయంలో కూడా సచిన్‌కే పత్రికలు, మీడియా అగ్రతాంబూలం ఇచ్చాయి. ద్రావిడ్ కృషిని పెద్దగా పట్టించుకోలేదు. పాక్ కెప్టెన్ వకార్ యూనస్ మాటల్లోనూ చూస్తే "సచిన్ అవుటైనపుడు భారత్‌కు ఇంకా నూరు పరుగులు కావాల్సి ఉంది. ఆ సమయంలో కనుక ద్రావిడ్ వికెట్‌ను తీసుకోవడంలో మేము సఫలం అయితే ఏమి జరిగి ఉండేదో ఎవరికి తెలుసు? ద్రావిడ్ తనకు మాత్రమే సాధ్యమైన ఇన్నింగ్స్ ఆడి భారత్ ఇబ్బందుల్లో పడకుండా చేశాడు" అన్నాడు. అతడు బౌండరీ కొట్టి విన్నింగ్ రన్ కొట్టాడు. ఈ విషయాన్ని కూడా పత్రికలు పట్టించుకోలేదు. ఇంగ్లండ్‌పై జరిగిన మ్యాచ్ విషయానికి వస్తే ఇదే పునరావృతమైంది. ఫిబ్రవరి 26న జరిగిన ఈ మ్యాచ్‌లో టెండూల్కర్ తనదైన శైలిలో బౌలర్లపై విరుచుకుపడి భారత్‌కు శుభారంభం ఇచ్చాడు. అతడు అద్భుతంగా ఆడి అర్ధ సెంచరీ చేశాడు. ఇంతలో ఫ్లింటాఫ్ బౌలింగ్‌కు దిగి పరిస్థితిని ఒక్కసారిగా మార్చివేశాడు. అతడు సెహవాగ్, సచిన్ వికెట్లను వడివడిగా తీసి భారత శిబిరంలో ఆందోళన రేకెత్తించాడు. ద్రావిడ్ మరోసారి భారత్ ఇన్నింగ్స్‌ను మరమ్మతు చేసే భారాన్ని స్వీకరించాడు. 62 పరుగులు చేసి పరిస్థితిని చక్కదిద్దాడు. భారత్ గౌరవప్రదమైన 250 పరుగుల స్కోరు సాధించేలా చేశాడు. తరువాత పనిని ఆశిష్ నెహ్రా పూర్తి చేశాడు. అతడు 23 పరుగులు మాత్రమే ఇచ్చి ఆరుగురు ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్‌ను పెవిలియన్‌కు పంపాడు. ఇక్కడ కూడా నెహ్రానే హీరోగా భాసిల్లాడు. ద్రావిడ్‌ను ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. ఈ పరిణామాలు ద్రావిడ్‌ను



కించపరుస్తున్నాయని ఎవరైనా అనుకుంటే వారు పప్పులో కాలేసినట్లే. "ఎవరు హీరోగా అవతారమెత్తుతారు అనేది కాదు ప్రశ్న. పత్రికల్లో పతాక శీర్షికల్లోకి ఎక్కాలనే కోరిక ఎన్నడూ నాకు లేదు. నేను ఏమిటో దానితో సంతృప్తి చెందుతున్నాను. నా బాధ్యత అంతా జట్టు కోసం పరుగులు చేయడమే. దీనిని సక్రమంగా నిర్వర్తిస్తే చాలు సంతోషం మిగులుతుంది నాకు. బ్యాక్‌గ్రౌండ్‌లో ఉన్నామా, లేక లైమ్‌లైట్‌లో ఉన్నామా అనేది నాకు తెలియదు. నా జట్టు గెలవాలనేదే నేను ఎప్పుడూ కోరుకునే విషయం. అంతకు మించి ఏమీ కాదు" అని రాహుల్ ద్రావిడ్ పేర్కొన్నాడు. పత్రికలు, మీడియా ద్రావిడ్‌కు అంతగా ప్రచారం కల్పించకపోయినప్పటికీ అతడు సాటి క్రికెటర్లలో మంచి స్థాయి కలిగి ఉన్నాడు. అతని ఆట తీరు, మైదానంలో వివాదాలకు తావు లేకుండా వ్యవహరించే తీరు అందరి అభి వ్రా నాల ను చూరగొంటుంది. ఆసీస్ టెస్ట్ కెప్టెన్ స్టీవ్ వా మాటల్లోనే చెప్పాలంటే "టెండూల్కర్ అద్భుతమైన ఆటగాడు. ఇది నిజమే. యువ క్రికెటర్లకు మోడల్‌ను ఎంపిక చేయాల్సి వస్తే అది ద్రావిడే అవుతాడు" అని పేర్కొన్నాడు. భారత్‌తో మ్యాచ్ జరగక ముందు 'రావల్పిండి ఎక్స్‌ప్రెస్'గా పేరుపొందిన షోయిబ్ అక్తర్ నోరు పారేసుకుని పలచనయినప్పటికీ ఒక నిజం ఉచ్ఛరించాడు. "ద్రావిడ్‌ను అవుట్ చేయడం ప్రత్యర్థి జట్టుకు ఎంత ముఖ్యమో ఎవరూ అవగాహన చేసుకున్నట్లు లేదు. అతడు ఆడలేక ఇబ్బంది పడుతున్నాడని అందరూ తేలికగా తీసివేసే తరుణంలోనే అతడు నిదానంగా అర్ధ సెంచరీ పూర్తి చేసుకుంటాడు. దీంతో భారత జట్టు స్కోరు ఒక్కసారిగా పుంజుకుంటుంది. అతడు కావాలంటే భారీ షాట్లకు పోగలడు" అని అక్తర్ వ్యాఖ్యానించాడు. బ్రాడ్‌మన్ తర్వాత క్రికెట్ చరిత్రలో అత్యద్భుత బ్యాట్స్‌మన్‌గా అభివర్ణింపతగ్గ వివియన్ రిచర్డ్స్‌కు ద్రావిడ్ శైలి అంటే అపరిమితమైన మక్కువ. అతని ఆటతీరును, టెంపర్‌మెంట్‌ను అవకాశం చిక్కినప్పుడల్లా ప్రశంసిస్తూ ఉంటాడు. ప్రముఖ బాక్సర్ మహమ్మద్ అలితో ద్రావిడ్‌ను పోల్చాడు. "అలి వలెనే ద్రావిడ్ నిత్య సమరశీలి. అతడు ప్రత్యర్థిని పదిహేనవ రౌండ్ వరకూ తీసుకెళతాడు. అంతా సవ్యంగానే జరుగుతోందని భ్రమపడతారు. ఇంతలో అకస్మాత్తుగా వస్తుంది మెరుపువేగంతో నక్షత్రాలు చూపించే దెబ్బ. ఇక ప్రత్యర్థి పని అంతే." అని రిచర్డ్స్ పేర్కొన్నాడు. పరిపూర్ణ అంకిత భావం ప్రదర్శించడంలో అతణ్ణి మించిన వారు లేరని కెప్టెన్ గంగూలీ ఒక సందర్భంగా వ్యాఖ్యానించాడు. "అతని బ్యాటింగ్ తీరు అనితర సాధ్యం. జట్టు ఇన్నింగ్స్‌ను కుదుటపరచాలంటే అతనికి తప్ప ఎవరికీ అంత సమర్ధవంతంగా సాధ్యం కాదు. వికెట్ల వెనుక కూడా అతడు క్రమంగా మెరుగుపడుతున్నాడు. అతడు వికెట్ కీపింగ్ చేయడం వల్ల భారత జట్టులో సమతూకం ఏర్పడిందని కొనియాడాడు. అతడు మోడల్ క్రికెటర్ అని పేర్కొన్నాడు. తనకు ఏ పని అప్పగించినా సమర్థవంతంగా నిర్వహించడంలో ద్రావిడ్‌ది అందె వేసిన చెయ్యి. ఇన్నింగ్స్ ప్రారంభించమని కోరినా, మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు రమ్మన్నా, వికెట్‌కీపింగ్ చేయమన్నా ... దేనికైనా సిద్ధం మన ద్రావిడ్ ◆

✻ మొలకలపల్లి కోటేశ్వరరావు

బుజ్జీ... దిగ్రేట్!

నాగరాజు నా చిన్ననాటి స్నేహితుడు. ఇద్దరం బళ్ళోనూ, చేలమ్మటా, చెట్లమ్మటా పుట్లమ్మటా తిరుగుతూనూ, చదువుకుంటూనూ గడిపాం చిన్నతనంలో.

వాడు మన రాష్ట్రంలోనే మా వూరికి దూర ప్రాంతంలో మొన్నటి వరకూ ఉద్యోగం చేశాడు పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా. అతను చేసింది మంచి పర్యాటక కేంద్రం.

"ఒక్కసారి రారా అటు. రెండు రోజులు వుండిపోదువు. ఎప్పుడూ పనీ పనేనా? లైఫ్‌లో ఎంజాయ్ ఎప్పుడు చేస్తావురా? తిరగాలి. తిరక్కపోతే థ్రిల్ ఏముంటుందిరా?" అనే వాడు అప్పుడు.

కానీ నాకు వెళ్ళడానికి వీలు కుదరక వెళ్ళలేకపోయాను.

ఆరు నెలల క్రితం మాకు కొంచెం దగ్గర ప్రాంతానికి ట్రాన్స్‌ఫరై వచ్చాడు. ఒక్కసారి వచ్చి వెళ్ళమని అడగటం, నాకూ అక్కడ ఒక పని పడటంతో ముందుగా ఫోన్ చేసి ప్రయాణమయ్యాను.

వాడి విగ్రహం మంచి ఒడ్డూ పొడుగూ కలిగి ఉంటుంది. మనిషి కూడా గట్టివాడే! డిగ్రీ అయిన వెంటనే సబిన్‌స్పెక్టర్ పోస్టుల ఖాళీలు పడటం, వీడు అప్లయ్ చేయడం, సెలక్ట్ కావడం అన్నీ వెంటవెంటనే జరిగిపోయాయి.

నలుగురు కూతుళ్ళు వున్న డిఎస్పీ కన్ను వీడి మీద పడింది. అంతే. ఆయన చిన్న కూతురు మెళ్ళో మూడు ముళ్ళు వేశాడు.

ఆమెకి విపరీతమైన అహంకారం అనీ, ఎవర్నీ లెక్క చేయదనీ, పొగరు జాస్తి అని చెప్పి వీడు బాధపడ్డాడు నా ముందు ఏడెనిమిదేళ్ళ క్రితం! ఇప్పటి పరిస్థితి తెలీదు. ఎలా ఉన్నారో!

రైల్వే స్టేషన్‌కి వాడి క్వార్టర్ దగ్గరే! తేలికగానే కనుక్కుని వెళ్ళగలిగాను.

భార్యనీ, కొడుకులిద్దర్నీ పరిచయం చేశాడు. పెద్ద వాడికి పదేళ్ళు, చిన్న వాడికి ఎనిమిదేళ్ళు. పిల్లలు ఇద్దరూ కూడా తల్లిదండ్రులకి మల్లే బలంగా, దిట్టంగా ఉన్నారు.

"మా పెద్దాడ్రా.. అన్నిట్లో మహా యాక్టివ్! చాలా చురుకు. దేనిలో అయినా ఫస్ట్ వుండాల్సిందే, ఎక్సెప్ట్ ఎడ్యుకేషన్. అందులో మాత్రం లాస్ట్ అనుకో!"

"అదేమిట్రా..చదువు సరిగా లేకపోతే ఎలా? ఇవ్వాళ పేరెంట్స్ అందరూ పిల్లల ఎడ్యుకేషన్‌కే ఫస్ట్ ప్రిఫరెన్స్ ఇస్తున్నారు కదా?"

"మనం చదువుకొమ్మని ఫోర్స్ చేసినా వాళ్ళకి అందులో ఇంట్రెస్ట్ వుండాలి కదా! ఇంట్రెస్ట్ లేకపోతే ఏ పని అయినా ఎలా సాధ్యమవుతుంది?" అన్నాడు వాడు. ఆ మాటల్లో కొంత నిరాశ కూడా ధ్వనించినట్లు నాకు అనిపించింది.

కొద్దిసేపు వూరి విషయాలు మాట్లాడుకున్నాం.

ఇంతలో డిఎస్పీనుంచి ఏదో మెసేజ్ వచ్చింది. స్టేషన్ వరకూ వెళ్ళి రావాలి. నన్ను రెస్ట్ తీసుకోమని చెప్పి వెళ్ళిపోయాడు.

వరండాలో కూర్చుని న్యూస్ పేపర్ చూస్తూ పరిసరాల్ని గమనించడం మొదలుపెట్టాను.

వీడి క్వార్టర్ సెపరేట్‌గా ఉంది. ఇంటిముందు విశాల స్థలం. చాలా మొక్కలునాటారు.

ఇవి కొత్తగా కట్టిన క్వార్టర్స్. ఈ క్వార్టర్ పక్కగా కొంచెం దూరంలో చిన్న చిన్న గదులతో కానిస్టేబుల్స్‌కి వేరేగా కొన్ని క్వార్టర్స్ కట్టారు.

వీధిలోనికి వెళ్ళిన పెద్ద పిల్లవాడు కొద్దిసేపటికి వచ్చాడు. తోచకవాడితో మాటలు కలిపాను.

"నీపేరేంటన్నావు బాబూ?"

"జితేంద్ర అంకుల్! అయితే అందరూ బుజ్జి అంటార్లే అంకుల్!"

"ఎన్నో క్లాసు చదువుతున్నావు?"

"ఫోర్త్ స్టాండర్డ్"

"ఇందాక మీ డాడీ నువ్వు చదువులో క్లవర్ కాదని చెబుతున్నాడు కదా! చదువుకోకపోతే ఎలాగ? పెద్దయ్యాక ఏం కావాలనుకుంటున్నావు?"

"చదువెందుకు అంకుల్? నేను పెద్దయ్యాక పొలిటికల్ లీడర్ని అయి దేశాన్ని ఏల్తాను అంకుల్!"

వాడి మాటలకు నివ్వెరపోయాను.

"పొలిటికల్ లీడర్‌వి అయినా చదువుంటే ఇంకా బాగుంటుంది కదా బాబూ! నువ్వు లీడర్ కావాలని ఎందుకనుకుంటున్నావ్?"

"అదయితే ఎంచక్కా బాగుంటుంది కద అంకుల్!"

"ఏం బాగుంటుంది?"

"ప్రజలకి ఎవరంటే ఎక్కువ భయం కలుగుతుంది అంకుల్?" నన్ను ప్రశ్నించాడు.

ఆలోచించాను.

"దొంగల్ని చూస్తే భయం కలుగుతుంది!"

"కాదు అంకుల్! దొంగల్ని చూస్తే ఎవరూ భయపడరు. వాళ్ళు దొరికితే కొడతారు కూడా! మొన్న ఒక దొంగ దొరికితే వాడ్ని వీర కొట్టుడు కొట్టారు. వాళ్ళంటే భయపడితే వాడ్ని ఎందుకు కొడతారంకుల్?"

"మరి ఎవరంటే భయపడతారంటావు?"

"పోలీసులు అంటే భయపడతారు. అవునా అంకుల్?"

"నిజమే సుమా!"

"మరి ఇప్పుడు చెప్పండి అంకుల్... పోలీసులు ఎవరంటే జంకుతారు?"

నాకు అర్థం కాలేదు. పోలీసులు ఎందుకు భయపడతారు? భయపడితే అసలు వాడు ఆ ఉద్యోగానికి ఎలా పనికి వస్తాడు? "పోలీసులు ఎవర్ని చూసినా జంకరు!"

"కాదు అంకుల్. పొలిటీషియన్స్‌ని చూసి పోలీసులు భయపడతారు. వాళ్ళకి అణిగిమణిగి ఉంటారు. ట్రాన్స్‌ఫర్ల్లా, ప్రమోషన్ల కోసం వాళ్ళని అడుక్కోక తప్పదు కదా! అందుకే వాళ్ళంటే భయభక్తులతో ఉంటారు!"

వాడికి మంచి పరిశీలనా శక్తి ఉంది. ఇంట్లో వాళ్ళ డాడీ మమ్మీ ఎప్పుడైనా సందర్భం వచ్చినప్పుడు మాట్లాడుకునే మాటల్ని బట్టి వాడు ఈ విషయం గ్రహించి వుంటాడు.

కాలు నిముషం నిలవదులా వుంది, బయటకి పరుగెత్తాడు.

సాయంత్రం నాలుగున్నర సమయంలో ఓ గుంపు పిల్లల్ని వెంట పెట్టుకు వచ్చాడు.

"మీరు ఇక్కడే వుండండ్రా!" అని ఇంట్లోకి వెళ్ళి పెద్ద టిన్ బిస్కట్స్ తీసుకొచ్చాడు.

"తీసుకోండ్రా!" అని ఆ పిల్లలందరికీ టిన్ బిస్కట్స్ మొత్తం పంచేశాడు.

లోపలి నుంచి వాళ్ళ మమ్మీ బయటికి వచ్చి పిల్లల్ని చూసి మళ్ళీ లోపలికి వెళ్ళి టీవీ వీక్షణంలో మునిగిపోయింది.

"రేయ్... ఈ బిస్కట్స్ మీకు వూరికే పెడుతున్నాననుకుంటున్నారేమో! అదేంకాదు, రేపు నేను మీ ఇంటికి వచ్చినప్పుడు ఇప్పుడు తీసుకున్న వాటికి డబుల్ బిస్కట్స్ పెట్టాల్రోయ్! ఊరికే తినిపోతే కుదరదు!" అన్నాడు.

"సర్లేరా" అన్నాడు తెల్లగా వున్న ఒక పిల్లవాడు.

వాడు కూడా బాగా బలిష్టంగా వున్నాడు. చక్కగా, నైస్‌గా టీషర్ట్ వేసుకున్నాడు. దానిమీద 'బ్లెయిర్-ఇంగ్లండ్' అని ఇంగ్లీష్ అక్షరాల్లో ఒక పదం కింద మరో పదం రాసి ఉంది.

"ఇక ఆటలు మొదలు పెడదాంరా!" అన్నాడు బుజ్జి.

"ఇవ్వాళ ఏం ఆట ఆడుకుందాం?" అడిగాడు తెల్లపిల్లవాడు.

"ఇవ్వాళ క్రికెట్ వద్దురా? వంగుదూకుళ్ళ ఆడుకుందాం!" బుజ్జి.

"నిన్న బాడ్మింటన్ కానీ, కబడ్డీ కాని ఆడుకుందాం రేపు అన్నావ్ కదా బుజ్జీ?" ఒక పిల్లవాడు అడిగాడు.

"నిన్న అంటే నిన్నే... రేపు అంటే రేపే.. ఇవ్వాళ ఎలా అవుతుంది రా?" అంటూ వాడి బుర్రమీద గట్టిగా డిప్పకాయ ఇచ్చాడు. అసలే వాడిది గుండు. పాపం వాడికి కళ్ళంట నీళ్ళు తిరిగాయి.

బుజ్జిమాటలు-అవి తర్కమో, తలతిక్కో నాకు అర్థం కాలేదు.

"ఇప్పుడు ఆట ఎవరు పెడతారు?" అడిగాడు బుజ్జి.

"చప్పట్లు వేసుకుందాంరా" గుండోడు గుండు తడుముకుంటూనే అన్నాడు.

"ఏమిటీ.. చప్పట్లా! అయితే చప్పట్లలో బుజ్జి డన్ అయితే ఆటపెట్టాలా?" అడిగాడు తెల్లోడు.

"పెట్టాలిగా మరి!"

"చూడు బుజ్జీ... నువ్వు డన్ అయితే ఆటపెట్టాలంట!"

"ముందు నువ్వు ఆట పెట్రాల్రా గుండూ" అన్నాడు బుజ్జి.

"నేను ఎందుకు పెడతాను?"

"ఎందుకా? మాకు ఎదురు మాట్లాడుతున్నందుకు!" అన్నాడు తెల్లోడు.

ఆ పిల్లలు అందరూ బుజ్జికి సపోర్టే!

చివరికి వాడిని బలిపశువుని చేశారు.

వాడు వంగాడు. వాడి వీపు మీద చేతులు పెట్టి అందరూ దూకడం మొదలు పెట్టారు.

బుజ్జి వంగిన వాడి వీపు మీద దభీమని రెండు చేతులతో కొట్టి ఎగిరి దూకుతున్నాడు. అలా దూకేటప్పుడు చేతులు మినహా శరీరంలో ఏ అవయవం తగిలినా వాడు ఔట్ అయినట్లే! అలా ఔట్ అయిన వాడు ఆటపెట్టాలి. వాడి మీదుగా పిల్లలు అందరూ దూకుతారు.

అలా దూకడంలో బుజ్జి రెండుసార్లు ఔట్ అయ్యాడు. బుజ్జి కాళ్ళు రెండుసార్లు తగిలాయి.

"నువ్వు ఔటయ్యావు. నీకాలు టచ్ అయింది!" అన్నాడు వాడు.

"టచ్ కాలేదు!"

"అయింది బుజ్జీ!" అన్నాడు వాడు బతిమాలినట్లు.

"కాలేదూ కాలేదూ కాలేదూ!'

"నీకాలు తగిలిందంటుంటే.." వాడు పట్టు వదలకుండా భయపడుతూనే ఆటపెట్టకుండా అన్నాడు.

"నోర్మూసుకుని ఆటపెట్టు ముందు. లేకపోతే నీకు మూడిందే!"

"నేను ఎందుకు పెడతాను ఏమిటి? నేను ఆటపెట్టను. నువ్వు పెట్టాల్సిందే!" ఎదురు తిరిగాడు వాడు.

"రేయ్... నాకు ఎదురు చెపుతావురా?" అంటూ బుజ్జి వాడ్ని వంగదీసి వీపుమీద గట్టిగా కొట్టడం మొదలు పెట్టాడు.

తెల్లోడు కూడా బుజ్జికి సపోర్ట్‌గా వాడ్ని కొడుతున్నాడు.

మిగిలిన పిల్లలకి బుజ్జిదే తప్పు అని తెలుసు. అయినా ఎవరూ గుండు వాడికి సపోర్ట్‌గా

(మిగతా 23వ పేజీలో)

వర్తమాన పరిణామాలపై విశిష్ట రచనలు

నూతన సహస్రాబ్దిలో అంతర్జాతీయంగా, దేశీయంగా మన సమాజం రెండు ప్రధాన సవాళ్లనెదుర్కొంటోంది. వీటిలో మొదటిది అగ్రరాజ్యం అమెరికా పోషిస్తున్న అంతర్జాతీయ దాదాగిరి. రెండవది దేశ ఆర్థిక, సామాజిక వ్యవస్థను డొల్లగా మార్చుతున్న ఎల్‌పిజి (సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ) విధానాలు. అగ్నికి ఆజ్యం పోసినట్లుగా దీనికి మతతత్వ విధానాలు కూడా తోడయ్యాయి. గత శతాబ్ది చివరి దశకంలో ప్రారంభమైన ఈ జంట ప్రమాదాలు నేడు తీవ్ర రూపం దాల్చుతున్నాయి. వీటి లోతుపాతుల్లోకి వెళితే గాని వర్తమాన పరిణామాలను సరిగ్గా అంచనావేయలేము. అమెరికా ఇరాక్‌పైకి ఎందుకు యుద్ధానికి దిగుతోంది? మన దేశంలో స్వదేశీ నినాదంతో అధికారంలోకి వచ్చినవారు విదేశీ బహుళజాతి సంస్థల ముందు ఎందుకు సాగిలపడుతున్నారు? వీటి గురించి అవగాహన చేసుకునేందుకు సీనియర్ జర్నలిస్ట్ డి.పాపారావు రాసిన "ఇదీ అసలు అమెరికా!","ఇటు స్వదేశీ జెండా- అటు బ్యాంకు అజెండా'' పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఇవి వివిధ పత్రికలలో, ఆన్‌లైన్ ఎడిషన్లలో వివిధ సందర్భాల్లో ఆయన రాసిన వ్యాసాల సంకలనమే అయినప్పటికీ చదువరులకు ఎంతో విలువైన, అరుదైన సమాచారం వీటిలో లభిస్తుంది. ఆ విధంగా వ్యాసరచయిత కృషి సార్థకమైనట్లే భావించవచ్చు.



ఇటు స్వదేశీ జెండా - అటు బ్యాంకు అజెండా



అంతర్జాతీయ పెత్తనం - అంతర్గత పతనం
ఇదీ అసలు అమెరికా

వెల : రూ.32/- రచన : డి.పాపారావు వెల : రూ.30/-

ప్రతులకు : డి.పాపారావు, ప్లాట్ నెం.212, కన్నాబ్లాక్, గార్డెన్ టవర్స్, మాసబ్‌ట్యాంక్, హైదరాబాద్,

చైతన్య పబ్లికేషన్స్‌వారు ప్రచురించిన ఈ రెండు విలువైన పుస్తకాల ధర కూడా తక్కువే. ఆర్థిక మాంద్యంలో కూరుకుపోయిన అమెరికా ఆర్థిక వ్యవస్థ గురించి, అక్కడి మానవ హక్కులు, ప్రజాస్వామ్యం తీరు తెన్నుల గురించి చక్కగా విశ్లేషించారు. అమెరికాను డాలరు స్వర్గంగా భావించేవారికి కనువిప్పు కలిగించే కొన్ని కఠిన వాస్తవాలను ఇందులో వివరించారు. రెండవ పుస్తకం "ఇటు స్వదేశీ జెండా- అటు బ్యాంకు ఎజెండా" లో బంకర్లనుండి బంకులదాకా బిజెపి కుంభకోణాలు, అయోధ్యపై సంఘపరివార్ నాటకాన్ని చక్కగా విశదీకరించారు. అంతకన్నా ముఖ్యంగా సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో మన దేశ ప్రజాస్వామ్యం, ఇక్కడి సామాన్య, మధ్య తరగతి, కార్మిక వర్గం ముందున్న సవాళ్ల గురించి విశ్లేషించారు. వీటిని ఎదుర్కొనేందుకు ఏమి ప్రత్యామ్నాయమో కూడా ఒక వ్యాసంలో తెలియజేశారు.

రాష్ట్రంలో ఉపాధి రహిత అభివృద్ధి దాని పర్యవసానాలను గురించి 'విప్లవం' వెలుగులో పొంచివున్న చీకట్లు అన్న వ్యాసంలో చక్కగా వివరించారు. టూరిజం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీల ద్వారా జరిగే ఉపాధి గాలి బుడగ వంటిదని ఇది ఎంతో కాలం వుండదని పలు దేశాల అనుభవం చెబుతోందని చేసిన వక్కాణింపు రచయిత రాజకీయ నిశిత పరిశీలనకు దర్పణం పడుతోంది. హైడొక్కుగా మారిన హైటెక్! వ్యాసంలో అమెరికాలోను, భారత దేశంలోను సాఫ్ట్‌వేర్ రంగంలో నెలకొన్న మాంద్యం గురించి సవివరంగా వివరించారు. ఇంకొక వ్యాసంలో పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రతి దానినీ వ్యాపార సరుకుగా ఎలా మార్చుతుందీ, మార్క్సిస్టు కోణం నుంచి విశ్లేషించే ప్రయత్నం చేశారు. సెప్టెంబర్ 11 తరువాత అమెరికాలో జాతి వివక్ష, మానవ హక్కుల వుల్లంఘన, నేరాలు ఎలా పెరుగుతున్నవీ ఒక చోట వివరించారు. ప్రభుత్వ రంగంలోని చమురు పరిశ్రమల ప్రైవేటీకరణ, తెహల్కా టేపుల ఉదంతం తరువాత ఎన్డీయే ప్రభుత్వం రాజకీయ నైతికత కోల్పోయిందని సరిగానే వ్యాఖ్యానించారు. ఎన్డీయే తన ఆర్థిక విధానాలతో సామాన్య ప్రజానీకానికి బాగా దూరమైపోయిందని, ఆర్థిక విధానాలు, సామ్రాజ్యవాద అనుకూల విధానాల పర్యవసానాన్ని కరెక్టుగానే అంచనా వేశారు. "వర్గ స్వభావం మారిన నేపథ్యం మారిన దశలో సాయుధ విప్లవం సాధ్యమా? అనే పేరుతో ప్రచురితమైన వ్యాసంలో వుప్పల నరసింహం మొత్తంగా కమ్యూనిస్టు సిద్ధాంతాన్నే సవాల్ చేసేవిధంగా రాసిన రాతలకు దీటుగా ఈ రచయిత జవాబిచ్చాడు. సోవియట్ యూనియన్ అంతర్థానమైనా మార్క్సిజం ప్రాశస్త్యం చెక్కుచెదరలేదని తర్కబద్ధంగా వివరించిన తీరు బాగుంది. స్థల భావం వల్ల ఈ పుస్తకాల్లోని కొన్ని వ్యాసాల గురించి మాత్రమే ఇక్కడ రేఖామాత్రంగా పేర్కొనడం జరిగింది. ఆకర్షణీయమైన శీర్షికలతో విలువైన సమాచారంతో సాగిన ఈ వ్యాస పరంపర 1999- 2002 సంవత్సరాల మధ్య కాలంలో ప్రచురితమైనవే అయినప్పటికీ ఇందులో పేర్కొన్న చారిత్రిక, ఆర్థిక గణాంక వివరాలు ఎప్పటికీ ప్రాధాన్యత కలిగివుంటాయి. గుజరాత్ తరహా ప్రయోగాన్ని బిజెపి దేశవ్యాపితంగా అమలు చేయజూస్తున్న ఈ తరుణంలో దానిని తిప్పికొట్టాల్సిన అవసరాన్ని రచయిత గట్టిగా నొక్కి చెప్పడం అభినందనీయం. ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకాలు ఇవి. ఆయన కలం నుంచి మున్ముందు ఇటువంటి రచనలు మరిన్ని వెలువడగలవని ఆశిద్దాం.

* కె.గడ్డెన్న

స్వీకారం

చూరు...

"వసుధ" హైకూలు; వెల : రూ.15/-;
ప్రతులకు : చింతపల్లి వెంకటనారాయణ, కన్వీనర్, సాహితీ మిత్రులు, కైకలూరు, కృష్ణాజిల్లా

భారత స్వాతంత్ర్యసమరంలో పశ్చిమగోదావరి జిల్లా

రచన : పరకాల పట్టాభిరామారావు;
వెల : రూ.50/-; ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు



చెదిరిన పిచ్చిక గూడు

రచన : ఆర్.శశికళ; వెల : రూ.35/-;
ప్రతులకు : దిశ పుస్తకకేంద్రం;
నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్

...రు చేశాడు. అతడిపై ఇండియన్ పీనల్ కోడ్‌లోని ...37, 338 సెక్షన్ల కింద కేసు నడిచింది.

రోడ్డు ప్రమాదం జరగటం వల్ల సురేశ్ ఎల్లప్ప పాటిల్‌కు కుడిపాదం నలిగిపోవడంతో అతడు ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందాడు. రోడ్డు ప్రమాదం కారణంగా అతడికి శారీరక, మానసిక బాధతో పాటు ఆసుపత్రి ఖర్చులు కూడా అయ్యాయి. నిర్లక్ష్యంగా, అతివేగంగా వాహనాన్ని నడిపిన కర్నాటక రాష్ట్ర ఆర్.టి.సి. డ్రైవర్ కారణంగా ఇదంతా జరిగింది. ఆర్.టి.సి. సంస్థ ఈ ప్రమాదానికి పరోక్ష బాధ్యత వహించి బాధితుడైన సురేశ్‌కు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ మోటారు వాహనాల చట్టం కింద నష్ట పరిహారం చెల్లించాలని కోరుతూ కేసు దాఖలు చేశాడు. బెల్గావ్ లోని మోటారు ప్రమాదాల ట్రిబ్యునల్‌లో కేసు వేసి తనకు నష్టపరిహారంగా మూడు లక్షల రూపాయలు చెల్లించాలని కోరాడు. ప్రమాదాలు జరిగిన సమయంలో అతని వయస్సు 36 సంవత్సరాలు. ప్రమాదంలో అతని కుడి పాదం దెబ్బతినటం వల్ల అతడు ఈ పనులను సక్రమంగా చేసుకోలేని స్థితిలో ఉన్నాడు. అందువల్ల అతనికి ఆదాయం తగ్గిపోయింది. ప్రమాదానికి పూర్వం ఏ విధంగా పని చేసే వాడో, ప్రమాదం తరువాత ఆ విధంగా పని చేయలేకపోతున్నాడు. అందువల్ల సురేశ్‌కు ప్రమాదం వల్ల జరిగిన శారీరక బాధ, ఆసుపత్రి ఖర్చులు, ఆదాయం తగ్గినందుకు, ఆసుపత్రిలో ఉన్న సమయంలో పని చేయలేక పోయినందుకు, జీవితంలో సంతోషాన్ని కోల్పోయినందుకు మొత్తం మూడు లక్షల రూపాయలు పరిహారంగా చెల్లించాలని కర్నాటక ఆర్.టి.సి. సంస్థ మీద కేసు దాఖలు చేశాడు.

ట్రిబ్యునల్ నోటీసులందుకున్న ప్రతివాదులు తమ జవాబును రాతపూర్వకంగా దాఖలు చేస్తూ ప్రమాదం జరగటానికి తమ నిర్లక్ష్యం కారణం కాదని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన తేదీ నాడు కర్ణాటక ఆర్.టి.సి. బస్సు అల్నావార్ నుంచి బెల్గావ్‌కు వెళ్తోంది. ఆ బస్సు సురేశ్ నిలబడిన క్రాస్ రోడ్డు వద్దకు చేరుకోగానే కొందరు ప్రయాణీకులు బస్సును ఆపమని అడగటం వల్ల అక్కడ బస్సు ఆగింది. అప్పుడు అక్కడ మరో ట్రక్కు కూడా ఉంది. ఒక వ్యక్తి బస్సును ఎక్కే బదులు ట్రక్కులోకి ఎక్కబోతూ బస్సు ముందర జారిపడ్డాడు. ఆ విధంగా అతని కాలుకు తీవ్రమైన గాయాలయ్యాయి. ఆ విధంగా గాయపడిన వ్యక్తిని బస్సు డ్రైవర్ ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చాడు. సురేశ్ ఎల్లప్ప పాటిల్ నిర్లక్ష్యం కారణంగానే అతడి కుడి కాలుకు గాయలయ్యాయని, అతడు ఆరోపించినట్లుగానే ఆర్.టి.సి. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం ఏమీ లేదని ప్రతివాదులు కోర్టులో జవాబు చెప్పారు.

కోర్టులో వాది, ప్రతివాదులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేయటం వల్ల కోర్టు ఈ సమస్యను పరిష్కరించాల్సి వచ్చింది. ఇరుపక్షాల నుంచి సాక్షులను, కేసుకు సంబంధించిన పత్రాలను ప్రవేశ పెట్టారు. సురేశ్ తరపున ఒక ప్రత్యక్ష సాక్షి సురేశ్ చెప్పిన సాక్ష్యాల్ని సమర్థిస్తూ కోర్టు ముందు సాక్ష్యం చెప్పాడు. సురేశ్‌కు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేసిన డా॥దినేశ్ కాలే అతడికి శాశ్వత అంగవైకల్యం కలిగిందని సాక్ష్యం చెప్పాడు. అతడి కుడి పాదానికి తీవ్రమైన గాయాలు కావడం వల్ల అతనికి కూర్చోవడం బాధాకరంగా ఉంటుందని తెలిపాడు. మోటారు వాహనాల ట్రిబ్యునల్ సాక్ష్యాధారాలన్నింటినీ పరిశీలించి సురేశ్‌కు మొత్తం పరిహారంగా లక్షా నలభైవేలు చెల్లించాలని తీర్పుచెప్పింది.

ప్రతివాదులు హైకోర్టుకు వెళ్ళారు. ట్రిబ్యునల్ తీర్పును ప్రశ్నించారు. హైకోర్టు మళ్ళీ సాక్ష్యాధారాలను పరిశీలించింది. హైకోర్టు బస్సు డ్రైవర్ చెప్పిన సాక్ష్యాన్ని నమ్ముతూ అతడే కనుక ప్రమాదానికి కారకుడైతే గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తీసుకెళ్ళే వాడు కాదని, ప్రత్యక్ష సాక్షి చెప్పిన సాక్ష్యాల్ని అకారణంగా పక్కకు నెట్టింది. ప్రత్యక్ష సాక్షి సురేశ్‌కు అనుకూలంగా సాక్ష్యం చెప్పినట్టు హైకోర్టు భావించింది. కానీ అతడి సాక్ష్యాన్ని త్రోసిపుచ్చడానికి గల కారణాలను చెప్పలేకపోయింది. రోడ్డు ప్రమాదం జరగటానికి సగం కారణం సురేశ్ నిర్లక్ష్యమేనని భావించింది. కాబట్టి నష్ట పరిహారాన్ని తగ్గిస్తూ సురేశ్‌కు కేవలం నలభై ఐదువేలు ప్రతివాదులు చెల్లిస్తే సరిపోతుందని తీర్పు చెప్పింది.

కర్నాటక హైకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ సురేశ్ సుప్రీంకోర్టుకు వెళ్ళాడు. హైకోర్టు చెప్పిన కారణాలు, దాని తీర్పు సుప్రీంకోర్టుకు నచ్చలేదు. ప్రత్యక్ష సాక్షి చెప్పిన సాక్ష్యాన్ని నమ్మకపోయేటందుకు తగిన కారణాలు లేవు. అలాగే ఆర్‌టిసి డ్రైవర్ చెప్పిన సాక్ష్యం నమ్మదగ్గదిగా లేదు. సురేశ్ నిర్లక్ష్యం కూడా 50 శాతముందని చెప్పడం బాగాలేదు. సురేశ్ తమ్ముడితో కలిసి వ్యవసాయ పనులు, పాల వ్యాపారం చేస్తాడు. అందువల్ల అతడికి ఆదాయం రావటంలో నష్టం జరుగుతుందనటం అబద్ధమని హైకోర్టు భావించకూడదు. అతడికి భవిష్యత్ ఆదాయం 78 వేలు తగ్గుతుందనడం సబబే. హైకోర్టు ట్రిబ్యునల్ తీర్పును అనవసరంగా తిరగదోడింది. ట్రిబునల్ చాలా స్పష్టంగా అన్ని విషయాలను దృష్టిలో ఉంచుకుని సురేశ్‌కు భవిష్యత్ ఆదాయం 78 వేల వరకు తగ్గుతుందని అంచనా వేసింది. దానిని హైకోర్టు 25 వేలకు తగ్గించడం సరైంది కాదు. అందువల్ల హైకోర్టు తీర్పు ఏ విధంగా చూసినా సమర్థించ తగింది కాదు. బెల్గావ్ జిల్లా మోటారు ప్రమాధాల ట్రిబునల్ తీర్పు ప్రకారం బాధితుడైన సురేశ్‌కు లక్షా నలభై వేల రూపాయలు చెల్లించటం న్యాయమని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ◆

బుజ్జీ... దిగ్రేట్!

(19వ పేజీ తరువాయి)

మాట్లాడలేదు. వాడు అప్పు అని ఇచ్చిన బిస్కట్ల మహత్యం అది! ఒకవేళ ఎవరైనా గుండుకి సపోర్ట్‌గా మాట్లాడితే బుజ్జి చేతిలో తన్నులు పడతాయని మరో భయం వాళ్ళలో ఉండి ఉండొచ్చు!

ఇంతలో లోపలనించి బుజ్జి వాళ్ళ మమ్మీ బయటికి వచ్చింది.

గుండు పెద్దగా ఏడుస్తున్నాడు.

"వీడు చూలా ప్రమాదకరంగా తయారయ్యాడు మమ్మీ! మాకు ఎదురు తిరిగి మాట్లాడుతున్నాడు. మా మాట వినడం లేదు!" అన్నాడు బుజ్జి.

"వీడు చాలా డేంజరస్ ఆంటీ!" బుజ్జికి సపోర్ట్‌గా తెల్లోడు వంతపాడాడు.

"వాడ్ని అలా కొట్టకండ్రా! ఏం చేశాడు వాడు?"

"ఆటల్లో వీడు ఎప్పుడూ మాకు ఆపోజిట్‌గానే మాట్లాడుతాడు మమ్మీ! అంతేకాదు, మొన్న జామెంట్రీలో బ్లేడు పెట్టుకుని తెచ్చాడు. అది పెట్టి మమ్మల్ని గాయపరచాలని వీడి ఉద్దేశం!"

"బ్లేడా? అలాంటి ప్రమాదకరమైన వస్తువులు ఎందుకు బాబూ?" ఆమె ఆశ్చర్యపోతూ అడిగింది.

"పెన్సిల్ చెక్కుకోవడానికి వుంచుకున్నాను ఆంటీ!"

"పెన్సిల్‌ను షార్పనర్స్ పెట్టి చెక్కుకుంటారు కానీ బ్లేడ్ పెట్టి చెక్కుకుంటారా?"

"వీడివి నమ్మే మాటలు కాదు ఆంటీ! మొన్న మొలతాడులో రెండు పిన్నీసులు పెట్టుకున్నాడు. అవి పెట్టి మమ్మల్ని గుచ్చాలని వీడి ఉద్దేశం!" తెల్లోడు అన్నాడు.

"అసలు అలాంటి వస్తువులు ఎందుకు? అవి ఎంత ప్రమాదకరం!" అని ఆమె కోప్పడి లోపలికి వెళ్ళిపోయింది.

బుజ్జికి పొలిటీషియన్ అయ్యే లక్షణాలు మస్తుగా వున్నాయనిపించింది నాకు. అబద్ధాలు చెప్పడం, లంచాలు ఇచ్చి కొందర్ని తనవైపుకి తిప్పుకోవడం, దబాయింపులూ, దౌర్జన్యాలూ చేయడం లక్షణాలు అవే!

పిల్లలు వెళ్ళిన తరువాత ఒక్కడే లోపలికి వచ్చాడు.

"బుజ్జీ.. నీకు ఏ రాజకీయ నాయకుడు అంతే ఇష్టం? అంటే రాజకీయాల్లో ఎవర్ని ఆదర్శంగా తీసుకోవాలనుకుంటున్నావు?" అడిగాను.

"ప్రపంచంలో నెంబర్ వన్ టెర్రరిస్ట్ ఎవరు అంకుల్?" అడిగాడు వాడు.

ఆలోచించాను కానీ నాకు అంతు పట్టలేదు.

"తెలియదు బాబూ!"

"జార్జ్‌బుష్ అంటే నాకిష్టం!" అన్నాడు వాడు ధీమాగా. ◆

* కొండబాబు

మాతృభాష

ప్రపంచ తెలుగు మహాసభలు విశాఖ పట్నంలో జరగడానికి కొద్ది రోజుల ముందరి సంగతిది. ఓ డాక్టరుగారు తన క్లినిక్‌లో సన్నిహితులతో సమావేశమయ్యారు. వారిలో ఓ జర్నలిస్టు, ఓ రచయిత, ఓ సినీ చిన్న ఆర్టిస్ట్, ఓ చిన్న వ్యాపారవేత్త, ఓ స్కూలు యజమాని, ఓ పోలీసు అధికారీ ఉన్నారు. డాక్టర్‌గారితో సహా వీరంతా మాతృభాషాభిమానులు. పోలీసు అధికారి 'సెంటర్ ఆఫ్ ది అట్రాక్షన్'. ఆయనకు తెలుగంటే వల్లమాలిన ప్రేమ. ఆయనే చర్చను ప్రారంభించారు. 'మాతృభాష మరణశయ్యపై ఉందన్నారు. దేశభాషలందు తెలుగు లెస్సన్నారు. తేటతెనుగు కన్నా తీయనైనది లేదన్నారు.

మరి మన భాషను ఎలా బతికించుకోవాలి ? అని తన ప్రశ్నతో అడ్డుపడ్డారు ఆర్టిస్ట్‌గారు. అక్కడికే వస్తున్నానన్నారు పోలీసు అధికారి గారు. తాను గతంలో పని చేసిన చోట సాగించిన కృషిని వివరించారు. అందరూ శ్రద్ధగా విన్నారు.

ఇక్కడ కూడా అలాగే చేద్దామన్నారు. అవునవునన్నారు మరికొందరు. 'మనభాషనే వాడదాం.. మాతృభాషను కాపాడుదాం' అనే పిలుపునిద్దామన్నారు. ప్రకటనలు, కరపత్రాలు, అధికారులకూ, ప్రజాప్రతినిధులకూ వినతిపత్రాలూ ఇద్దామనుకున్నారు. అకస్మాత్తుగా జర్నలిస్టు గారికి ఒక సందేహమొచ్చింది. "ఎందుకు ఇదంతా?" అనడిగాడు.

"అదేంటి మన భాషను కాపాడుకోడానికి" అన్నారు అందరూ.

"ఎందుకు కాపాడుకోవాలి."

"మనది కాబట్టి"

"మనదయితే రక్షించుకోవలసిందేనా?.. అవసరం లేకపోయినా?"

"అవసరంలేదా? అదేంమాట?"

"అవసరముందా? అయితే అదేంటో చెప్పండి.. ఆ అవసరంతోనే ప్రజల్లోకెళదాం" అన్నాడు అతగాడు. అందరూ అంగీకరించారు.

* * *

ఆ తర్వాత తెలుగు మహాసభలకు ప్రారంభోత్సవానికొచ్చిన ముఖ్యమైన మంత్రిగారికి విషయం చెప్పి వినతిపత్రం ఇచ్చారు. కానీ ఆయన చప్పరించారు 'ఎందుకండీ ఇలాంటివి. ఇవేమైనా అభివృద్ధికి తోడ్పడుతాయా? వేరే సంపాదించుకునే విషయాలపై దృష్టి పెట్టండి' అన్నారు. అవాక్కయ్యారు ఆ మేధావులు.

* * *

నిజమే. 'మాతృభాషను కాపాడుకొందాం' అనే పిలుపు వల్ల ఉపయోగం లేకపోతే దాని కోసం ఎవరూ ఏమీ చేయరు... - ఆంధ్రుల ఆత్మగౌరవం పేరిట అధికారంలోకొచ్చిన వారు సైతం. అది అర్థమవుతూనే ఉంది కదా! తల్లిని కూడా ఉపయోగం లేకపోతే చూడాల్సిన అవసరం లేదనే 'వాణిజ్య వ్యవస్థ' దిశగా సమాజాన్ని నెడుతున్న కాలం కదా! ఇది.

భాష మనిషికీ మనిషికీ మధ్య అనుసంధానాన్ని కల్పించే గొప్ప 'నాగరిక వాహిక'. చదువుకున్నా, లేకపోయినా తరతరాల నాగరికతను ముందుతరాలకు తీసుకు వచ్చేదీ, వస్తున్నదీ ఆయా భాషలే. లిపి ఉన్నా లేకపోయినా ఇది జరుగుతుంది. అయితే లిపి ఉన్న భాషల్లో ఆ విస్తృతి ఎక్కువ. అంటే ప్రతి సమాజంలోని వైజ్ఞానిక, జీవన ప్రగతిని ముందు తరాలకు నేర్పేవి భాషలే. కప్పీ కనిపెట్టక ముందునుంచీ నేటి కంప్యూటర్ వరకూనూ. ఇదే అవసరం నేటికీ ఉంది. ఏ విషయానికి సంబంధించయినా మాతృభాషలోనే విద్యాబోధన జరగాలనే శాస్త్రీయ వాదన ఇందుకే పుట్టింది. మాతృభాషలో చెప్పినపుడే స్పష్టంగా మన భావాలను చెప్పగలం. మాతృభాషలో విన్నదానినే బాగా ఆకళింపు చేసుకోగలం... ఇంకా అభివృద్ధి చేసుకోగలం. చైనా, జపాన్ లాంటి దేశాల్లో ప్రగతికి మాతృభాషలో బోధన కూడా ఒక కారణమనేది విశ్లేషకుల అభిప్రాయం.

మాతృభాషాభిమానం అనేది కేవలం ఒక సెంటిమెంటు కాదు. అది ఒక 'అవసరం'. బృహత్తర అవసరం అంటే గానీ కచ్చితంగా సరిపోదేమో! కేవలం 'వాణిజ్య వ్యక్తిత్వా'ల కోసం ఇది చెప్పబోవడం లేదు. ప్రతి ఒక్కరికీ ఆ అవసరం, ఆవశ్యకత బోధపడితేగానీ భాష రక్షణ... తద్వారా మన వారసత్వం, నాగరికత, వైజ్ఞానిక ప్రగతి ముందుకు పోవనేదే అసలు ఉద్దేశం.

వేరే భాషలో బోధన జరిగితే భాషను అర్థం చేసుకోవడానికి, విషయాన్ని అర్థం చేసుకోవడానికీ రెంటికీ విద్యార్థి కష్టపడాలి. మాతృభాషలో ఆయా విషయాలను బోధించగలిగితే, భాషను అర్థం చేసుకోడానికి పెట్టే శ్రమను కూడా విషయంపైనే పెట్టొచ్చు. మనోవికాసం పెంచుకోవచ్చు. పిల్లల శక్తి సామర్థ్యాలను పెంచాలనుకునే ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన వాస్తవం ఇది.

మాతృభాష పట్ల అభిమానం ప్రతి భాషవారికీ ఉంటుంది. ఎవరికి వారు తమ భాష తీయనైనదని, గొప్పదనీ అనుకోవడమూ కద్దు. అదొక ఇష్టమైన భావన. స్వాభిమానమూనూ. అయితే కేవలం ఈ అంశాలే భావను నిలబెడతాయా? కొనసాగిస్తున్నాయా? అంటే కాదనేదే వాస్తవం. అంతకంటే మించిన అవసరం, ఆవశ్యకతలూ ఆయా భాషను బతికిస్తున్నాయి. అంశాలు ముందుకు తెస్తేనే కాపాడుకోగలం.

ఈ రీత్యానే... గిరిజన తెగల్లో.., మారుమూల గ్రామాల్లో ఉన్న ఆహారం, వైద్యం తీరుతెన్నులను తెలుసుకుంటే దాని నుంచి కూడా విజ్ఞానసారాన్ని అభివృద్ధి చేసుకోవచ్చుననేది వాదన ఉంది. ఇందుకోసం ఆయా భాషలు తెలిసుండడం అవసరం. మాతృభాషలోనే విద్య, బోధన అభివృద్ధి చెంది వుంటే వారే ఆ సారాన్ని మిగతా ప్రపంచానికి సమర్థవంతంగా చేరవేసి ఉండేవారు.

అంతేకాదు. మాతృభాషాభిమానం, వాడుక సన్నగిల్లిపోతూ, ఆంగ్లభాషాభిమానం పెరుగుతూ ఉండటమంటే, క్రమేణా ఆత్మాభిమానాన్ని, ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతాము. ఇద్దరి మధ్య జరిగే వాదనలో ఒకరు ఆకస్మికంగా ఇంగ్లీషులోకి మారి మాట్లాడి విషయం రీత్యాగాక తనకు తెలిసిన ప్రాచ్యభాషలో ఆధిక్యం కోసం ప్రయత్నించడమూ, అది ఫలించడమూ అనేక సందర్భాలలో ఇప్పటికే చూస్తూనే ఉన్నాం. ఇలాంటి పరిస్థితి విస్తరించకూడదనుకుంటే మాతృభాషలో వ్యవహారాలు నడపాలనే విషయంపై స్పష్టత కలిగి ఉండాలి. కాబట్టి భాషాభిమానం అనే పలుకుబడిలో సెంటిమెంటును కాదు అవసరాన్ని చూద్దాం. ◆

పాఠక స్పందన

కదిలించిన రియల్ స్టోరీ

మార్చి 2 సంచికలో ప్రచురించిన రియల్ స్టోరీ 'ఆ మొగ్గ వికసించనే లేదు...' నా మనసుని కలచివేసింది. చదువుకునేందుకు వెళ్ళిన లక్ష్మిని తన మోసపు మాటలతో మభ్యపెట్టి లొంగదీసుకున్న టీచర్ శిక్షార్హుడు. మన చట్టాల్లోని లొసుగుల మూలంగా ఎలాంటి శిక్ష లేకుండా ఆ మోసగాడు బైటపడటం నాకెంతో బాధ కలిగించింది. ఇలాంటి సంఘటనలు జరగకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ కథ తెలియచెప్పింది.

- ఉమ, మహబూబ్‌నగర్

సమైక్యతను చాటిన ఖాదర్ లింగాక్షేత్రం

మార్చి 2 సంచికలో ప్రచురించిన టూరిస్ట్‌గైడ్ శీర్షికన ప్రచురించిన ఖాదర్ లింగాక్షేత్రం హిందూ-ముస్లిమ్‌ల సమైక్యతకు చిహ్నంగా నిలిచిపోవటం ఆనందాన్ని కలిగించింది. అలాగే ఫిబ్రవరి 23వ తేదీ ప్రచురించిన 'అమ్మదొరికింది' కథ బాగుంది.

- మేడూరి సత్యనారాయణ, తిరువూరు, కృష్ణాజిల్లా

వాహ్‌వా అక్రమ్ !

మార్చి 2 సంచికలో ప్రచురించిన క్రీడారంగం వ్యాసంలో చాలా వివరాలు తెలియజేశారు. అక్రమ్ చేసిన రికార్డులు ఇప్పట్లో ఇంకెవరూ చేరుకోలేకపోవచ్చు. కానీ ఆ వ్యాసంలో అక్రమ్ పేరు బదులు వకార్ పేరు వచ్చింది. ఇట్లాంటి వ్యాసాల్లో తప్పు రావడం అంత క్షేమదాయకం కాదు.

- రాధాకృష్ణ, విజయవాడ